కథానిక

* గుడిగోపురం *

శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి

గుడిదగ్గర బడిపిల్లలు గుమిగూడేరు. గోళీకాయలు కొందరూ గోణీబిళ్లలు కొందరూ, గొల్ల స్తంభాల ఆట మరికొందరూ ప్రారంభించారు. ఆ మగపిల్లలతో బాటు మరోవయిపు ఆడపిల్లలు వామన గుంటలూ వానాలప్పలూ మొదలుపెట్టేరు. అంత హడావిడి జరుగుతూ మంచి సరందావిడిగా వుంటే, ఆ పక్క భవంతి యజమాని నారాయణరావు అరుగు మీదికి రాక ఎలా వుండగలడు? సరాసరి వచ్చి స్తంభానికి జార్లబడి చుట్టముట్టించి మూపు నిగిడించాడు. అయితే అతని దృష్టి ఆ పిల్లలమీద లేదు. ఆ గుడిగోపురంమీదికీ, ఆ గుడిపక్కనుంచి బడినుంచి వచ్చేదారిలోకీ అతని దృష్టి ప్రతిక్షణం ప్రసరిస్తోంది పర్యాయంలో!

అరుగుమీదికి నారాయణరావు రాగానే ఆ దార్ని నీలాటిరేవుకి వెళ్ళే అమ్మలక్కల ముక్కుల మీద వేళ్లు మొలిచాయి! 'ఇదేం పాడుబుద్ధో' అని ఒక ఇల్లాలూ, 'ఎలాగయితేం కట్టించుకున్నాడు మహా! రాతిల్లు!' అని మరో మగనాలీ, 'ఆమాట మన కెందుకు గాని ఆ పెద్దమనిసికి అన్నేళ్ళు గడిచాయ్! అరుగుమీద రాయిలా కదలకండా తంబాని కంటుకు పోయివుంటే ఆడాళ్ళు ఎలా వెళతార నేపాటి గేనమూ లేదంటే!' అని కొండొక కోమలాంగీ రకరకాలుగా నారాయణరావుగురించి అక్షతలు కలప సాగేరు.

అదేం గుర్తించడంలేదు నారాయణరావు. అతని దృష్టంతా గుడిగోపురంమీదా, బడినుంచి వచ్చే బాట మీదా లగ్నమై వుంది.

ఆడిపోసుకుంటూనే ఆ దార్ని వెళ్లే అతివలు వెళుతున్నారు. తొలగే తొయ్యాలులు వెనుదిరిగి పోతున్నారు. అలా వారం పదిరోజుల్నుంచి జరుగుతున్న గ్రంథమే!

మగ మహాశయులికీ నారాయణరావు వడవడిక కోపాన్ని కలిగించింది. కాని, 'నా అరుగుమీద నేన్నిలబడతా. నా యిష్టం.' అంటాడేమో! అనడు గాని ఒకవేళ అనడమే సంభవిస్తే ఏమిటి గతి? అని వాళ్ళబాధ. అదీగాక నలుగురిలో మంచిగా న్యాయపరుడులా వుంటూన్న ఆ నారాయణరావుగార్ని గమ్మున ఆడదానిమాట విని అనెయ్యడమే!—అని భయం. అనకపోతే—ఆయన అరుగుకి అంకితమివ్వడం మానకపోతే—ఆడవాళ్ల గొడవ ఎలాగురా భగవంతుడా అని బెడదా! బెంగాను!!—ఎటూ తోచక, ఏమీ చేయలేక కొందరూ, ఏమో చేద్దామని బయల్దేరి తీరా నారాయణరావుని చూడగానే మరేమో అయిపోయే మహానుభావులు మరికొందరూను! ఫలితం?—ఎవరిదారి వారిది!

ఎప్పటిలా నాలుగున్నరకాగానే నారాయణరావు అరుగుమీదికి రావడం, ఆడవాళ్లు అటూ ఇటూ కావడం, దారినపోతున్న మగాళ్ల కంఠాల్లో కంకర రాళ్లు కరుక్కుమనడం మామూలుగానే వుంది.

పావుగంట గడిచింది. పిల్లల హడావిడీ ఆటల సరందావిడీ అలానే వుంది. రక్కుకునేవాళ్లు రక్కుకుంటున్నారు నవ్వుకునేవాళ్లు నవ్వుకుంటున్నారు. ఏడ్చేవాళ్లు ఏడుస్తున్నారు. ఆడుకునే వాళ్లు ఆడుకుంటున్నారు. పాడుకునేవాళ్లు పాడుకుంటున్నారు. అదంతా బాలానందం! కోలాహలం!

నారాయణరావు దృష్టిమాత్రం గుడిగోపురం మీదనుంచి బడినుంచి వచ్చే బాటవయిపూ అక్కణ్ణుంచి మళ్ళీ గుడిగోపురంమీదికీ ప్రయాణిస్తోంది!

అదొక చిన్నగుడి! ఎప్పుడో వెల్లవేసినసున్నం. దాని తాలూకు అచ్చులు రాలుతూవున్నై! అందుకు తగిన గోపురం. నలువైపులా నాలుగు బొమ్మలు. ఒక బొమ్మ మొండెం తెగి తుండెం మిగిలివుంది. మరో బొమ్మ మాట్నుంచి రావిమొక్క రెమ్మలు తొడుగుతోంది. ఆ బొమ్మలపైన నాలుగువరసల మెట్లు. ఒక్క

మెట్టుకీ గోడు నలుపలకలు తీరివున్న పాపాన పోలేదు. అలాంటిమెట్లకి పైన మరికొన్ని లతలూ లావణ్యాలూ! ఆ చెక్కడాలపైనుంచి గోపురం సూచీముఖానికి మలచబడింది. ఆ మలుపులో నలువైపుల నాలుగుకోట రాకృతులు! వానిపైన గరగవంటి శిఖరం. ఆ శిఖ రానికి దిగువగా తన భవంతికి అభిముఖంగావున్న ఒక కోటరాకృతివయిపు నారాయణరావు దృష్టి సంలగ్నత! ఆ కోటరాకృతిలోంచి వచ్చే కువకువ ధ్వనులే అతని శ్రవణపుటాలని గిలిగింతలు పెడుతున్న మధురమంజుల నిక్వణాలు!–

అలా చూస్తూనేవున్నాడు నారాయణరావు,

తుర్రున తొర్రలోంచి ఓ పావురాయి బైటికి వచ్చింది. దాని వెనక నే మరోహటీ! ఒకటి పెంటిదీ! మరొకటి మగదీని! ఆడ పావురాయి ఆ చేరువలోని శిథిలవిగ్రహంమీద వాలింది. అల్లంత దవ్వులో మగ పావురాయి ఎదురుగా రావికొమ్మమీద వాలింది. పెంటిపావురం రెక్క లెగరవేస్తుంటే మగపావురం కూడా రెక్క లాడిస్తోంది. మగపావురం కువకువ మంటే ఆడపావురం కూడా కువకువమంటోంది!

వాటి వైఖరి చూస్తూ నారాయణరావు గుడి గోపురం మీదనుంచి దృష్టిని బడినుంచివచ్చే బాట కేసి మరలించాడు. దృష్టి ప్రసరించేంత దూరం వెళ్లిన కొలదీ బాట సన్నమవుతోన్నట్టు చెట్లతో క్రిక్కిరిసి పోతున్నట్టు మాత్రం వుంది. సమీపంలో గుడికి వాయువ్యంగా పెద్ద చెరువుంది. రేవులో ఎవరో జనం!—

ఎవరో జనం అనే నారాయణరావు భావన. ఆడవాళ్లున్నారని అత డనుకోగలిగితే అరుగుమీద తన అవతరణం వారికి అభ్యంతరం అని గ్రహించి ఈపాటికి లోపలికో మరే చాటుకో మరలేవాడే!

నారాయణరావు దృష్టి మళ్ళీ పావురాల జంట వయిపు ప్రసరించింది. ఈసరికి రెండు పావురాలూ వేరువేరు స్థానాల్లో లేవు. ఒకేచోటున వున్నయ్. ఒకదానిపక్క ఒకటి పరస్పరం కలిసిపోయి ఒకటే పావురం అన్నంత భ్రాంతిని కలిగిస్తున్నయ్!

కాస్త పరిశీలనగా చూశాడు నారాయణరావు!

ఆడపావురంలో ఒకానొక ఒదుగు, మగపావు రంలో ఒకానొక మగత—అవ్యక్తంగా అవసరంగా సుద్యోతకాలవుతున్నయ్. అదే దృశ్యాన్ని అక్షి యుగళంలో నిలుపుకుంటూ బాటవయిపు చూశాడు నారాయణరావు. అలా చూడగానే అతనిలో ఒక నూతనోత్తేజం వికాస విలాసం, లగ్నత నేత్రా లలో ఆనందరేఖలూ ప్రస్ఫుటించినయ్. అటే అతని దృష్టి సంశ్రయమయ్యింది. అంతకంతకు అత నిలో ముచ్చట అధికమవుతూవుంది. ఆ ముచ్చటతో బాటు మధ్య మధ్య గుడిగోపురంకేసి కూడా చూస్తూ మురిసిపోతున్నాడు. అతనికి ఎందుకో అంత ఆనందం?—

పశ్చిమాభిముఖంగా బాటవయిపు పయనించిన అతని దృష్టి క్రమంగా స్వగృహాభిముఖ మవుతోంది. అయ్యింది! ఇప్పు డతని దృష్టి క్షణం క్రిందికీ క్షణం పైకీ! అతని మనశ్శ్రీవాలలో క్షణం కువకువలూ! క్షణం గుసగుసలూ! క్షణం ఆడపావురాయి కిల కిలలూ! క్షణం సన్నటిగాజుల గలగలలూ! క్షణం మగపావురాయి రెక్కల సవ్వడి! క్షణం. కిర్రుతో కూడిన బూటుల చప్పుడు!—అన్నీ కొన్ని క్షణాల వ్యవధిలో! అదంతా ఒక లిప్తమాత్ర సంఘటన!

అంతవరకూ ప్రాంగణాభిముఖంగావున్న నారా యణరావు దృష్టి క్రమంగా ప్రాక్పథాభిముఖంగా పయనింపసాగింది. పయనిస్తూనే మలుపువరకూ మర లింది. మలుపు దాటితే మరి కనిపించని ఊరు. ఊరికి దవ్వుగా భవంతి కట్టుకున్న నారాయణరావు దృష్టి మలుపు దాటలేక మరల భవంతి మొహం పట్టింది. పడుతూనే గుడిగోపురంమీదికి ఎగబ్రాకింది. సరిగ్గా అదేసమయాన జర్రున పావురాల జంట ఆలయ కోట రాంతరంలోకి అంతర్ధానమైంది!

నారాయణరావు హృదయనాడుల్లోంచి స్మిత శ్రీలు ఒలికి సింహద్వారానికి సింగారాన్ని చిలికి, మెల్ల మెలగా ఇంట్లోని చిరుచీకటులలో మటుమాయ మయినయ్.

2

రాత్రి పదయింది. నడం చావడిలో ఎక్కడో పడక కుర్చీలో నడుం వాల్చేడు నారాయణరావు. బయట ఏం జరుగుతున్నదీ ఎంత వర్షం కురిసివెలిసిందీ అతనికి తెలీదు. ముసురువల్ల చావిడి మాత్రం చలిగా వుంది. అంతే. వెచ్చదనానికి కాళ్లమీద కాశ్మీరు శాలువా వేసికొన్నాడు.

మెల్లమెలగా నిద్రాదేవి చల్లటిమూపు అతని మీదికి ప్రసరించబోతోంది. ఇక లేచి పడకగది లోకి పోదామనుకున్నాడు. క్రమంగా లేవడంకూడా

జరిగింది. వీధితలుపు గడియ వేయడానికిగాను వీధి చావిడిలోకి వచ్చేడు. జార్లవేసివున్న తలుపుల్ని ఆపళంగానే దగ్గిరసగా వేశాడు. గడియ కూడా వేయబోయేడు.

'నారాయణరావుగారూ!' అని

అంతలోనే పిలుపు!

ఎవరైవుంటారు? అన్న ప్రశ్నతో మొహం మాత్రం చిట్లించి అదే భంగిమలోవుండి గడియ వేయడం మాని తలుపులు బారుగా తెరిచాడు. ఎదురుగా మెట్లమీద అయిదారుగురుదాక నిలబడ్డారు. వారి శిరస్సులమీద ముసుగులున్నయ్. వారి వెనక గుడి దగ్గరగా మరో ఇద్దరు ముగ్గురు ఉన్నారు.

ఓసారి నారాయణరావుదృష్టి గుడి మీదికి పోయింది. "ఆ పావురాలు గూటిలోనే వుంటాయి!" —ఇంత వాన కురిసినట్టు వీధి ఇప్పటికీ చెబుతున్నా తన కంతకుముందు తెలీనట్టు వాటికీ తేలీదేమో! తెలీకపోయినా చలిమాటో? అన్న స్పృహ కలిగి "ఎంతగా చలికి వణికిపోతాయో!" అనుకుంటూ చటుక్కున 'అరే!' అనుకొని నారాయణరావు గుమ్మం ముందున్న వ్యక్తులవంక చూశాడు. చూస్తూనే 'మీరా? రండి లోపలికి!" అన్నాడు. అని లోపలికి దారితీశాడు.

ఒక్కొక్కరే మెట్లమీద నిలబడ్డవారూ గుడి దగ్గర తచ్చాడుతున్నవారూ లోపల ప్రవేశించారు. వీధి చావిడిలో వున్న పొడుగాటి బల్లలమీద అంతా ఆసీనులయేరు!

'ఏదైనా పనిమీద వచ్చేరా?'

పడక కుర్చీలో కూర్చుంటూ నారాయణరావు అడిగాడు. ఆ వచ్చినవారిలో ముసిముసి నవ్వులు మొసులెత్తినయ్. వారి వైఖరి శంకించినట్టే వాస్తవం అని నారాయణరావు గ్రహించాడు. పైగా మున్సబుగారూ కరణంగారూ కలిసి వచ్చేరు. ఏదో వ్యవహారం లేనిది ఎందుకు వస్తారు? అని నారాయణరావు ఆలోచన.

'ఏమండి కరణంగారూ!' అన్నాడు నారాయణరావు వచ్చినపని చెప్పండన్న భావాన్ని అధ్యాహారానుకూలం చేస్తూ.

'అబ్బే...'

గ్రామకరణంగారైన భీమశంకరం నసుగుతూ మున్సబుగారి వంక ముసిముసి నవ్వులతో చూసేడు. కరణంగారితో బాటు మరో నాలుగు కన్నులు మున్సబును చూశాయి. మరో రెండు కంఠాలు సకిలించాయ్.

'చెప్పండి మున్సబుగారూ!' నారాయణరావు కూడా అడిగేశాడు!

'మరేం లేదండి. మీతో వీరంతా ఒక విషయం చెప్పకుందామని వచ్చేరు.'

'వీరేగాని మీరు కాదన్నమాట!'

నారాయణరావు ఛలోక్తిగా అని నవ్వేడు.

'ఎందుక్కారండీ! ఒకటే ఊరయ్యేక?' కరణం గారు శ్రుతి కలిపేరు.

'సరే ఏమిటది?' అన్నాడు నారాయణరావు. 'చెప్పండి.' ఒకళ్ళిద్దరు మున్సబుగారి చెవులు కొరికారు. మున్సబు మొదలు పెట్టాడు.

'మీరు వచ్చినప్పట్నుంచీ మా వూరికి ఓ కొత్త జీవితం ఏర్పడింది. అంతవరకూ అజ్ఞానంలోపడి అల్లాడేవారు!

"బాగానే వుంది! కరణంగారు కవిత్వంకట్టి మీ చేత పాడిస్తున్నట్టుందే!' అంటూ మున్సబు మాటకు అడ్డువచ్చేడు నారాయణరావు. 'నే చెప్పలేదూ నారాయణరావుగా రంటేఅవికత్థనులు అని!' అంటూ భీమశంకరం భీముడంత మనిషై సగర్వంగా సర్రయ్యవంక చూశాడు. తనమాటకు వాళ్లంతా హడలెత్తి పోయివుంటారని భీమశంకరం అభిప్రాయం! అంతపనీ జరిగింది. అర్థంగాక ఆ సర్రయ్య కాస్తా తేలకన్నులు వేశాడు. అది కనిపెట్టి తెలివైన ఘటం అవ్వడంచేత భీమశంకరం గుక్కతిప్పుకొని 'మన నారాయణరావుగారికి తన్నుగురించి పొగిడితే సహించలేరు!' అని వ్యాఖ్యానం చేశాడు.

'అవన్నీ ఎందుకు శంకరంగారూ! అసలు సంగతి చెప్పండి.' అన్నాడు నారాయణరావు. నిజంగా నారాయణరావులో సహించలేనితనం స్పష్టమయింది.

'నారాయణరావుగారూ! మీరేమన్నాగాని మీరు వచ్చేకనే మా పల్లెటూరికో పాఠశాల అనేది వచ్చింది. ఆడమేష్టారో మగమేష్టారో భార్యాభర్తలోఎవరో మొత్తానికి ఆ యిద్దరివల్లా పదిమంది పిల్లలకీ నాలుగు అక్షరం ముక్కలు వస్తున్నయ్.' 'అయితే—' చిరునవ్వు ప్రకటిస్తూ అన్నాడు నారాయణరావు. అప్పుడతని హృద్వలయంలో నాలుగ్గంట

లికి రణగోలచేస్తూ గుడిదగ్గర ఆటలాడుకునే పిల్లల హడావిడి రూపురేకలు దాల్చుకొంది. ఆ దృశ్యం గుర్తుకువచ్చి కలిగిన ఆనందంలో స్వీయప్రశంస అనే అంశాన్ని గమనించక అవునన్నట్టు నారాయణరావు 'అయితే?' అని అడిగాడు.

'అలాగే, పిల్లలతో బాటు పెద్దలు! లోకంలో ఎన్నిరకాల తంతులున్నా మావూరి ప్రజలకి భగవంతుడంటే వల్లమాలినంతభక్తి. పూజలూ పునస్కారాలూ! మీకు తెలీనివి గావు. తాతలనాటిది ఓ గుడివున్నదన్నమాటేగాని అందులోకి వచ్చి అర్చించడానికి అనువుగా లేదు. కనుక నలుగురిచేత చందాలు వేయించి మన భవంతి ఎదటిగుడి బాగుచేయిద్దామని! నలుగురికీ నచ్చే కార్యం. నలుగురూ కోరుతున్నదికూడా! ఇహమూ పరమూ అన్నారు పెద్దలు! అదేదో మీ పేరుమీదుగా జరగాలని మనవాళ్ళ మక్కువ. లేక గుడి కడుతున్నామంటే కాదనే కర్కోటకు లెవరుంటారు చెప్పండి."

'కర్కోటకు' లన్నమాట కటారిలా దూసుకుపోయింది నారాయణరావు గుండెని.

'దైవకార్యం. పదిమంది పట్టుదలా వుండాలే గాని పదినిమిషాల్లో మన నారాయణరావుగారు ఆపని చేయించలేరూ?'

అన్నాడు భీమశంకరం భాట్టభావంతో.

'గుడి మరమ్మత్తా?'

కొంచెం నీరసంగా వెలువడింది నారాయణరావుగొంతుకలోంచీమాట.

అంతా తలలు ఆడించేరు.

'ఆఁ!'

అన్నాడు నారాయణరావు ఆలోచనాజగత్తులో అడుగుపెడుతూ!

'ఆలయ పునర్నిర్మాణం! ఆ నీకులికి సరే! నా నీకులకయినా నాశనకరమైన విషయం కాదు. దైవం విశ్వాసంతో కూడిన విషయం. ఆ విశ్వాసం హేతురహితమూ గాఢతరమూను. వీరి మనసుల్లోంచి ఇప్పుడది మంచుపొగలా క్షణంలో దట్టమై మరుక్షణంలో మాయమయ్యేది కాదు. లేక పదిమందీ వాంఛిస్తున్న విషయం ఎలా కాదనగలం?

అవునే అంటాం. అయిదురోజుల్లో నిర్మాణ వ్యయం నిమిత్తం డబ్బు వసూలవుతుంది. సరకులన్నీ సరఫరాచేస్తాం. తాపీ మేస్త్రీలు వస్తారు...'

అప్పుడే నారాయణరావు మెదడులో ఆలయ పునర్నిర్మాణం జరుగుతోంది!

'ముందు శిథిలభాగాల్ని తీసి పారేస్తారు' గోపురం పూర్తిగా—ఆఁ!

నారాయణరావుకి గుండెల్ని రైలు ఢీకొన్నంత ఘాత కలిగింది. 'పాపం ఆ పావురా లెక్కడికి పోతాయి? అవి రోజూ సాయంకాలం ఆడుకుంటూ పాడుకుంటూ...'

నారాయణరావు కళ్లు చెమ్మగిల్లినయ్. అంతరాంతరం పాతాళాంతరంలోకి జారిపోతున్నట్టు అయింది.

'ఏమండి నారాయణరావుగారూ!' కరణంగారు కర్రతో నేలమీద చప్పుడుచేస్తూ చప్పున చెప్పండి అన్న భావంతో అడిగాడు.

'మంచి పని కాదంటారా?'

మున్నబు మెల్లగా ప్రశ్నించాడు. ఎలా కాదనగలడు నారాయణరావు?

'స...రే...' అందామనుకున్నాడు నారాయణరావు.

'పాపం ఆ పావురాలో!'

అంతరాత్మలో సూదిలా మెరిసింది!

మళ్లా నారాయణరావు మనస్సు గుంజాటనలో పడింది.

'ఏమిటి వీళ్లు. ఎంత అజ్ఞానంతో వున్నారు! శాస్త్రీయదృష్టి పూజ్యమే! ఆలయాన్ని బాగుచేయిస్తే ఒకవేళ దేవుడున్నా ఎవ్వరూ అమాంతం మజిలీ లేకండా వైకుంఠానికి ఎకాఎకీని ప్రయాణం చేయలేరు. ఆపాటిదానికి ఎందుకీ తతంగాలు? విగ్రహారాధన పెద్దవిషయం కాదు. విధి కాదు. మనసా ధ్యానిస్తే చాలని ధర్మశాస్త్రాలే ఘోషిస్తున్నయ్. పోనీ— వారి కదో ఆనందం! అజ్ఞానమో విజ్ఞానమో అని అంగీకరిస్తే? రెండుదుష్ఫలితాలు. ఒకటి వారి మౌఢ్యాన్ని మరింత ధ్రువం చేసి దృఢతరం చేసినవాడవుతాడు తాను. రెండు—ఎక్కణ్ణుంచి వచ్చారో ఎలా వచ్చేరో నిక్షేపంగా జీవిస్తున్న ఆ పావురాలు అనాథ పక్షు లవుతాయే! అవేమయితేం? అసలు ఏమీ కావు. తిన్నగా ఎక్కడికో పోయి మరో శిథిలాలయాన్నో జీర్ణ వృక్షాన్నో ఆశ్రయించి హాయిగా వుంటాయి! కాని తన కంటికి—

మరి నారాయణరావు యోచన సాగలేదు.

'ఆలయ పునర్నిర్మాణ ప్రయత్నం వద్దు' అని ఖండితంగా చెప్పడమే కర్తవ్యంగా తోచింది నారాయణరావుకి. ఆమాట చెప్పేద్దా మనుకున్నాడు. మరోసారి ఆలోచించాడు. 'ఎందుకు వద్దంటున్నాను?' అని ప్రశ్నించుకున్నాడు. "నాకోసమా?' మరో ఉపప్రశ్న ఉత్పన్నమయింది. అడగకుండానే 'అవును' అన్న సమాధానం అతని ఎదుట ప్రత్యక్షమయింది.

'కాదు. నాకోసం కాదు. వారి మూఢత్వాన్ని తొలగించడానికే! పావురాలు ఎగిరిపోయినా తనకేం బాధలేదు. ఉన్నా అది ఒక హేతువు కాదు. అసలు పావురాల ప్రమేయమే లేదు. ఆలయ పునర్నిర్మాణం వలనిఫలితం అజ్ఞానాంధకారంతో అలముటించే గ్రామీణుల్ని మరింత మూఢులుగా మూర్ఖులుగా తయారుచేస్తుంది. ఎన్నెన్ని విచిత్ర విషాద ఘట్టాలు సంభవిస్తాయి? అందులో అమ్మవారి గుడి! పూజలన్నా నైవేద్యాలైనా అవి క్రమంగా జాతర్లవరకూ ఎదిగి జంతుహింసలకి కారణభూతమవుతాయి. మహా ఘోరమది. అంచేత ముఖ్యంగా ఆలయపునర్నిర్మాణాన్ని ప్రతిఘటించాలి!—

అభ్యుదయ భావాలు నారాయణరావులో ఆవేశానికి తెర లెత్తినయ్.

'వద్దు. ఆ ప్రయత్నం మంచిది కాదు." నారాయణరావు నోటిదాకా వచ్చింది. నాలుక చివరంటా వచ్చింది. ఇంక అనడమే అవశేషం.

'మాటాడరేం?'

కరణంగారి కంఠంతోబాటు కర్ర చప్పుడు కాస్త హెచ్చుస్థాయిలో అనిపించి నారాయణరావు ఆగంతుకులవంక చూశాడు.

'వద్దు.' అందామని నోరు తెరిచాడు.

ఎదురుగా ఏడెనమండుగురి ఉత్సుకత!

'అలాగే!' అనేశాడు నారాయణరావు.

'ఒయల్దేరుతూ నే చెప్పలేదూ? మన నారాయణరావుగారు మన గ్రామాన్ని అన్నివిధాల ముందుకు తీసుకుపోయే మహానుభావులని! మన అదృష్టంవల్ల ఎక్కడినుంచో ఈ వూరువచ్చి స్వగ్రామం అన్నట్టు వ్యవహరిస్తున్నారు...

కర్ర నేలమీద ఆనిస్తూ కరణంగారు దండక మెత్తుకోగానే మున్సబుగారు లేచి "మరి సెలవండి." అన్నాడు.

నారాయణరావు 'ఆఁ' అంటూ అందరివంకా చూశాడుగాని అతని దృష్టిలో సజీవ రేఖలు సన్నగిల్లినయ్. గాజుపలకలోంచి ప్రసరిస్తున్న సూర్యకిరణంలా మందగించిన అతని చూపును అక్కడివా రెవ్వరూ చూడలేదు. ఎవరిమట్టుకు వారు వెళ్లడానికి లేచారు. వారిని సాగనంపడానికి నారాయణరావు వీధిగుమ్మందాకా వెళ్ళేడు.

అంతా వీడ్కోలు వాక్యాలు చెప్పి వీధిమొహం పట్టేరు. నారాయణరావు దృష్టి అనాలోచితంగా ఆలయంమీదికి వెళ్ళింది. సూటిగా కోటరాకృతి కనిపించింది. నారాయణరావు ముఖంలోంచి ఓ కాంతిరేఖ ఎక్కడికో ఎగిరిపోయింది! అదే సమయాన కోటరాకృతిలోంచి కోమలంగా వెలువడ్డ కువకువధ్వని అతని హృదయంలో చురకత్తిలా కలదిరిగి కవ్వమాడింది! అలా చూస్తూనే, మరబొమ్మ చేతుల్లా నారాయణరావు చేతులు తలుపులు జారవేయడానికి నిటారుగా సాగాయి!

3

తెల్లవారింది. ఆశ్చర్యం!

సరిగా వెలుగైనా రాలేదు. అప్పుడే అమ్మవారి గుడి అరుగుమీద తాపీ మేస్త్రీలు!!

అప్పుడే లేచి నిద్రకళ్ళతోనే బైటికివచ్చిన నారాయణరావు వాళ్ళని చూశాడు. క్షణం తనకళ్లని తాను నమ్మలేకపోయేడు.

రాత్రి పదిమందీ వచ్చి చెప్పి ఇంకా సరిగా తెల్లవారలేదే! అదైనా రాత్రి వాళ్ళన్నది చేయించాలన్న సంకల్పం మాత్రమే! ఇంకా జరగాల్సినది సవాశేరు గ్రంథం వుంది. ముందు పదిమందిదగ్గర చందాలు వసూలు చెయ్యాలి! ఎవరైనా భూరివిరాళాలిస్తారేమో చూడాలి! దాన్నిబట్టి ఎంతడబ్బు ఖర్చుపెట్టగలమో ఒక నిర్ణయానికి రావాలి! సనాతనమయిన ధర్మాన్ని పురస్కరించుకొని ఇంతా ఆలయాన్ని మరామత్తు చేస్తూ మరా సంప్రదాయాన్ని అనుసరించి వాస్తు చూపించి ముహూర్తం పెట్టించి.. ఇంకా...ఇంకా...ఎంతో తతంగముంటే, అప్పుడే ఈ తాపీ మేస్త్రులు ఆయుధసామగ్రితో తెల్లారకుండానే వచ్చా రేవిఁటి?'

తెల్లబోయి చూస్తున్నాడు నారాయణరావు. ఒకటి రెండు నిమిషాలు గడిచాయ్.

'మందీ పక్కనుంచి మొదలుపెడదాం.'

'అలాగే మొదలుపెట్టి ముహూర్తంచేసి ఆగం. పూర్తయిందాకా ఇదే పని!'

తాపీమేస్త్రీల మాటలు నారాయణరావు చెవిని బడ్డాయి. మరీ క్షణం యోచన వ్యర్థం అనిపించింది.

'ఏమోయ్ ఇలారండి.' అని వాళ్ళని పిలిచాడు.

'అయ్యా!' అంటూ మేస్త్రీలు నారాయణరావుకి సమీపంగావచ్చి వినయవిధేయంగా నిలబడ్డారు.

'ఎవరు పురమాయించారు మీకీపని!' నారాయణరావు మామూలుగా అడిగినట్టే అడిగాడు.

'చెప్పడమయితే మున్సబుగారే చెప్పారు కానండి, పనంతా పురమాయించింది కరణంగారండి.' 'అలాగా?' అంటూ నారాయణరావు ఆలయంవంక చూశాడు. పావురాల నివాసమయిన కోటరం కనిపించింది. ఒక్కసారి నారాయణరావుహృదయం స్త్రీహృదయంలా తరుక్కుపోయింది!

నిద్రపోతున్న పసినెత్తురుకందుల్ని విచ్చు కత్తులతో తుత్తునియలుచేస్తున్నట్టు అనిపించి భరించలేకపోయేడు.

'నేను వీల్లేదన్నానని చెప్పండి. మీ యిళ్లకు మీరు పొండి.' తీవ్రంగా అన్నాడు నారాయణరావు.

తాపీమేస్త్రీలకు నడినెత్తిమీద తాటికాయలు పడ్డంత పనయింది! నారాయణరావుగారు చాలా శాంతం కలవారని ఆయనకి కోపం రానేరాదని ఆ భవంతి కట్టిననాడు అనుభవంలో వారు గ్రహించిన విషయం. అలాంటిది అకస్మాత్తుగా నారాయణరావు అగ్గిమీద గుగ్గిలమవ్వడంతో వాళ్లకి హడలెత్తిపోయింది.

'ఏం?'

మళ్ళా నారాయణరావు హుంకరించాడు. తాపీమేస్త్రీలు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు! గుడ్లు తేలవేశాడు ఒకడు. మరొకడు మెడ వాలేశాడు. మెల్లగా ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు కూడబలుక్కున్నట్టుగా మాటా మంతీలేకండా మౌనంగా ఆలయందగ్గరకు వెళ్ళి సాధనాలు చంకను బెట్టుకున్నారు.

4

సరే! మంచితనంవల్లో మరే కారణంవల్లో అన్నవెంటనే వాళ్లు అవతలకి వెళ్లారు. వెళ్ళి ఊరుకుంటారా? పని పురమాయించినవాళ్ళకి చెబుతారు. వాళ్లు వింటారు. నానావిధాల భావాలు వాళ్లల్లో పొడుకుంటాయి.

మున్సబు అసలే ముక్కోపి! దానికి సాయం, తాను దలచినదానికి వ్యతిరేకం జరగరాదన్న తత్వం కలవాడు. ఏమంటాడో?

భీమశంకరం వసపిట్టే గాని భల్లూకపుపట్టుపట్టే మనిషల్లే తోచడు. తతిమా వాళ్ళంటే మున్సబుకో కరణానికో అనుయాయిలు! కనుక విషయం మున్సబుకీ కరణానికీ ముందే చెప్పడం మంచిది...

అనుకుంటూ కాఫీ తాగడమవ్వగానే నారాయణరావు ఊళ్ళోకి బయల్దేరాడు. మున్సబుగారు ఇంట్లో లేరని లోపల్నుంచి జవాబు వచ్చి తిన్నగా కరణంగారింటికి వెళ్లాడు. భీమశంకరంగారు డస్కు ముందర దస్త్రాలు సర్దుకొంటున్నాడు. నారాయణరావుని చూడగానే 'రండి రండి' అంటూ ఆహ్వానించాడు.

'ఏమండీ కరణంగారూ! తెల్లారకండానె తాపీమేస్త్రీలు వచ్చేరు. ఏ విధంగా పని జరపాలో ఎంత డబ్బు అవుతుందో ఇంకా మనం ఒక నిర్ణయానికి రాలేదు. ముందు ఒక ప్లాను వుండటం ఎందుకయినా మంచిదికదా?' అన్నాడు నారాయణరావు.

'అదేవిటండోయ్. గురువులేని విద్య గుడ్డివిద్యని ప్లానూ ప్రణాళికా లేని పనేవిటి? లక్ష విధాల చెప్పేను. మున్సబుకి తలకెక్క లేదు.'

'ఏవంటాడు?'

'ఏమని చెప్పను? అసలు నారాయణరావుగారూ! ఒక విషయం. మీకు నేను చెప్పకూడదు గాని మంచితనంగా వుండేవారికి అకారణంగా అపనిందలు అంటగడితే నేనుమటుకు సహించలేను. మీరు నిస్వార్థంగా ఇంత సేవ చేస్తున్నారే! ఆ మున్సబుకిగాని మరోహడికిగాని విశ్వాసంలేదు. పరాయివాడు పరాయివాడే అని వాళ్ళది ఒకటే దాసరి పాట! అదీగాక నారాయణరావుగారూ! ఇది క్షుద్ర గ్రామం. ఇలాంటిచోట మీవంటివారికి తావు దొరకదు. మీ మంచితనం నెగ్గదు.' అన్నాడు కరణం ఖండితంగా.

'మరి మనమూ జాగ్రత్తగా వుండాలి!'

'ఏమి జాగ్రత్తండీ' మీకు తెలీడంలేదుగాని— సరే. నాకెందుకు లెండి. ఏమిటో వెధవది బొత్తిగా నాది జాలిగుండె. భరించలేక వెళ్ళగక్కుతుంటాను. 'కలహ మహాముని రా మనం కరణంగారంటే' అన్న అపప్రథకి పాల్పడుతూవుంటాను. నాకే బుద్ధి వుండదు.'

నారాయణరావు మాటాడలేదు.

'అసలీ వెధవలోక ధర్మమే ఇంతండీ! న్యాయానికి ధర్మానికి స్థానంలేదు. మీరు రాత్రి దేవాలయ పునర్నిర్మాణాన్ని అంగీకరించారా? పాపం! అమాయకులు మీరు—అంతా మీమీద వున్నట్టే వారు మాటాడేరు. కాని నా కది సహించదు.'

'ఏది సహించదు?'

'అబ్బే. ఏమీ లేదండి నోరుజారింది.'

'ఫర్వాలేదు చెప్పండి. నామీద మీకు నమ్మకం లేదా?'

'ఎందుకు లేదు. ఉండబట్టే ఈ నోరు జారడాలు! మళ్లా మీరు వాళ్లకి చెప్పరని నాకు తెలుసు. కాని...నారాయణరావుగారూ! నావంటి ఏకపక్షి ఎక్కడి విషయం అక్కడే రెక్కలు దులిపినట్టు దులిపెయ్యడం మంచిదిగాని ముక్కున తగిలించి మోసుకురాగూడదండీ!'

'మొత్తానికి మీకూ నామీద శంకే!'

'ఛా ఛా! ఆ అల్పులికయితే అలాటి వెధవ శంకలున్నాయిగాని అన్నీ తెలిసిన నాకూ అదే రోగమా? ఎంతమాటన్నారు: మీకు తెలీదుగాని నారాయణరావుగారూ! మీరు నవనీత హృదయులని నాకు తెలుసు. నమ్మండి చెబుతున్నా. మీ సలహాయే నిజంగా కావలిస్తే మీతో మాటాడంది తాపీమేస్త్రీలని ఎందుకు ముందే పురమాయించాలి? పోనీ పురమాయించడం తప్పుకాదే అందాం. అన్ని సంగతులూ మీకు చెప్పినప్పుడు ఆ మేర్వాణీ ఏమయింది అసలు సంగతి చెప్పకుంటానికి? అని నేనంటాను. అందుకే నాకు అలాంటి గొడవలు సహించవ్'

'ఎవరు పురమాయిస్తే?'

మామూలు కంఠంతోనె అడిగాడు నారాయణరావు, కరణంగారి మాటలన్నీ కర్ణపుటాలలో పడుతున్నా గమనించేలా ఆయన ముఖకవళికలలో ఏమీ మార్పు పైకి ముద్ర వేసుకోలేదు.

'ఏమిటంటారు?'

అన్నాడు ఉలిక్కిపడి భీమశంకరం.

'పురమాయించిం దెవరని?'

'బాగుందండీ! పేరుపెట్టి చెప్పాలా? ఎంత వెర్రివారండీ మీరు! తనకీ నాగరికత తెలుసునే! పట్టణాల్లో ఉన్నాడే! నాకంటె ఏమంత నారాయణరావు ఘనాపాటీ అని ఈ సంస్కారణలు అని మున్నబుగారి దుగ్ధండీ!'

ముక్కుపుటాల్లో నస్యం బిగిస్తూ కరణంగారు కరకరలాడేరు.

'కరణంగారూ! ఇక సెలవు.'

అంటూ నారాయణరావు లేచేడు.

స్వగృహాభిముఖంగా కాలు సాచేడు. భీమశంకరం వంతెనవరకూ సాగనంపి సెలవు దీసికొన్నాడు. ఒంటరిగా నారాయణరావు నడక మొదలు పెట్టాడు. అడుగులు జోరుగా పడుతున్నాయి. మలుపు తిరిగాడు.

'నమస్కారమండి! నారాయణరావుగారూ!'

అన్నమాట వినబడి తలయెత్తి చూశాడు.

ఎదురుగా మున్నబు!

'నమస్కారం. ఎక్కణ్ణించి. ఇంటిదగ్గర లేరంటే వచ్చేస్తున్నా.' అన్నాడు నారాయణరావు.

'నేను మీయింటికే బయల్దేరానండి.' అన్నాడు మున్నబు.

'సరే! ఆఁ. ఏమిటి సంగతి?'

'అబ్బే! రాత్రి మీతో నేను చెప్పింది—'

మున్నబు అంటుండగానే

'ఆఁ. ఏమయింది?'

అన్నాడు నారాయణరావు యథాకంఠంతోనె.

'అబ్బే! చందాలు గట్రా ఏమిటి వస్తయో చూద్దాం. పదిరోజు లాగుదామంటే రాత్రి నాకూడా వచ్చినవాళ్లు సుతరాం ఒప్పుకోలేదు. కరణంగారో హాటి వాళ్లకి తగ్గట్టు కొన్ని సమిధలు వేశాడు. మొత్తానికి పదిమంది రాత్రి మా యింటిదగ్గర్నించి వస్తూ దారిలోనే తాపీ మేస్త్రీలకి పురమాయించేరు. నేను కొంచెం కిందా మీదా ఆలోచిస్తూనే వున్నా. మేస్త్రీలు నిద్రలోంచి లేచివచ్చి 'ఏమిటి బాబూ

సెలవు' అంటే అనుమానిస్తూనే 'మన గుడి మరామత్తు చెయ్యాలి!' అన్నాను. అనడం తడవు నలుగురూ తొందరలో ప్రారంభించాలి అన్నారు. 'శుభస్య శీఘ్రం. తెల్లారుగట్ల దశమి శేషతిథి. అయిదు గంటలకి ఆల్వాచీగా పని మొదలు పెడితే సరి!' అన్నారు కరణంగారు! ఆ మాటమీద నలుగురూ సరే అంటే సరే అన్నారు. నారాయణరావుగారికి చెప్పనిదేనా అని నసుగుతుంటే 'ముసుగులో గుద్దులాటా ఏమిటి పురమాయించండి అంటే పురమాయించండి అని నలుగురూ నాలుగు మాటలన్నారు.

మొత్తానికి—

మున్నబు కళ్ళల్లో బెదురు తొంగిచూడటాన్ని గమనిస్తూనే వున్న నారాయణరావు మెల్లగా అన్నాడు. 'అవును. మేస్త్రీలు రానే వచ్చారు. మరో కారణాన పని మానేసి పొమ్మన్నాను.'

'అది తెలిసే మీకేం కోపం వచ్చిందో అని గబగబా మీయింటికి వచ్చేను. అయితే పొలంమీదనుంచి రావడంవల్ల దారులు వేరయ్యాయి'

'అఁ దానికేం, ఊరివాళ్ళకి ఆలయం తప్పనిసరిగా బాగుచేయించుకోవాలన్న భావం ఉన్నప్పుడు మనం కాదని అనకూడదు. ఇందాక ఏవిటో నామనసంతా అదో మాదిరిలావుండి వాళ్లని పొమ్మన్నాను. దశమి. పోయినా ఏకాదశీ మంచిదే! మధ్యాన్నంనుంచి పని మొదలు పెట్టిద్దాం. ఈలోగా మనం ఎవరెంత డబ్బు ఇచ్చేదీ ఒక అందనా వేసికోవాలి! భోజనమయ్యాక ఒకసారి మాయింటికి వస్తారా?' అన్నాడు నారాయణరావు.

'సాయంత్రం రాకూడదాండి.'

'అలాగైనా సరే!'

'అయితే సాయంత్రమే వస్తాను.'

'మంచిది. మరి సెలవా?'

నారాయణరావు కాలు కదపబోయి మున్నబు వంక చూశాడు. మున్నబు మొహంలో ఒక తచ్చాట కనిపించి అలా చూస్తూ ఆగిపోయేడు. మున్నబు గొంతుక సవరించుకొంటూ ముందుకు వెళ్ళబోయి ఆగి 'నారాయణరావుగారూ!' అన్నాడు. మళ్లా కాలు సాచబోయిన నారాయణరావు సాచుతున్న కాలు సాచుతున్నట్టే ఆపి మున్నబువంక తిరిగాడు.

'మీయింటికి వస్తూ తాపీ మేస్త్రీలను కూడా దీసుకు వచ్చేను—మీకు సంగతిచెప్పి పని మొదలు పెట్టిద్దామని—తొమ్మిది గంటలదాకా దశమివుందని మళ్లా పదిమంది పట్టుపట్టారు. మీరు ఇంటిదగ్గర లేరు. మేస్త్రీలు 'నారాయణరావుగారు మీరు ఏకస్తులై చెప్పంది, ఎలా చెయ్యమండి?' అని గోలపెట్టారు... ఫర్వాలేదు. నేను మళ్ళీవచ్చి నారాయణరావుగారికి చెబుతా. ఆయన రాత్రి మాతోబాటు ఈపని చేయించాలనే అన్నారు. ముహూర్తం ఆగదుకదా! అని దగ్గరవుండి పని మొదలుపెట్టించి ఇలా వస్తున్నా. ఇంతలో మీరు ..'

అంటూ మున్నబు నారాయణరావు మొహంలోకి చూశేడు. నిర్వికార గభీరంగా వున్న నారాయణరావు ముఖాన్ని చూచి విస్మయచకితుడయిన మున్నబుగారి ముఖాన్ని నారాయణరావు చూచి 'పని మొదలు పెట్టారా?' అన్నాడు.

'నేనే మొదలు పెట్టించానండి.'

'సరే' మరి వస్తా.

'సెలవండి—సాయంత్రం తప్పకుండా వస్తాను.'

'నేను ఎక్కడికీ వెళ్ళను. ఇంటిదగ్గరే వుంటాను.'

మున్నబు తల ఆడిస్తూ ముందుకు నడిచాడు.

5

"ఒకరికంటె ఒకరు. కరణం సాక్షాత్తూ వృద్ధజంబుకం. మున్నబు మెత్తని పులి! సరే! వార్ని అనుకోవడమూ అనవసరమే! అవ్వాల్సిందేదో ఈపాటికి అవుతూనే వుంటుంది. పాపం మేస్త్రీలు! వాళ్లేం చేస్తారు? ఎవరి అధికారంలో వుందని ఎవరిమాట వింటారు? పైగా దేవుడిపెళ్ళికి అందరూ పెద్దలే! అందులో ఒకాయన మున్నబు. మరొకాయన కరణమూ! గ్రామాధికారులు! వారిని కాదని క్షణం సామాన్యులు బ్రతకలేరు. అంచేత తాపిపనివాళ్లని అనుకోవడమూ తప్పే!

ఈపాటికి గుడిలో ఏ సగమో కూలగొట్టే వుంటారు—"

ఈ స్ఫురణ కలగ్గానే నారాయణరావు గుండెలోనే గునపాలు కదిలాయ్! అడుగులు తడబడినయ్. అల్లాగే తలయెత్తి చూశాడు.

అల్లంత దూరంలోనె ఆలయం!—"అదిగో! మావిగున్నమాటునే పై శిఖరం! ఆ శిఖరం కిందనే—"

నారాయణరావు నాడులు చల్లబడసాగాయి. అతికష్టంమీద అడుగుపడుతున్నది. గున్నమావి కొమ్మల గుబురు దృష్టిపథాన్నుంచి తప్పుకొంది స్ఫుటంగా గుడి అదిగో! అరే! ఎవ్వరూ లేరేఅక్కడ?

ఆశ్చర్యంలో నారాయణరావు అడుగు జోరుగా పడబోయింది. 'వెనకవైపు ఉన్నారేమో!—' అన్న తలంపు కలిగి అంతలోనే ఉసూరుమని పోయింది నారాయణరావు ప్రాణం.

ఎల్లాగో కాలు కదుల్తోంది! మరికొంతదూరం నడిచాడు.

అన్నివైపుల్నుంచి ఆలయభాగాన్ని చూడవచ్చు. నారాయణరావు చూశాడు. చీలిపోతున్న గుండె ఎల్లాగో అదుముకుంటూ కళ్లు చీల్చుకుని మరీ చూశాడు.

నిజం! నిజంగా లేరు. ఏమైనట్టు తాపీపని వాళ్లు?

నారాయణరావు ఆదుర్దాపడసాగేడు. అంచెలంచెలుగా అడుగులు పడినయ్.

అమ్మవారిగుడిముంగిలికి వచ్చేశాడు.

నిజంగా తాపీమేస్త్రీలు లేరు. కనీసం గుడికి ముహూర్తం చేసినట్టుకూడా లేదు, మరి మున్సబు అలా చెప్పాడేం? దగ్గిరుండి పని మొదలుపెట్టించానన్నాడు! ఆ బాపతుచిహ్నాలేమీ కనిపించవే!

ఆతురత హెచ్చుతున్నకొలదీ కంగారు కంగారుగా చూశాడు. ఆలయాన్ని ప్రత్యణువునా పరిశీలనగా చూశాడు నారాయణరావు! ఎక్కడా శిథిల దేవాలయాన్ని మరామత్తునిమిత్తం కూలగొట్టినట్టు లేదు. ఏమిటిది?

నారాయణరావు కేమీ తోచలేదు.

ఆలయంచుట్టూ ప్రదక్షిణాలు మొదలుపెట్టాడు. మొదట రెండుమూడుసార్లు ఏమిశేషమూ లేదు. నాలుగోసారి నారాయణరావు కాలికి ఏదో తగిలింది. బాధపడుతూనే కాలికి తగిలిందేమిటని చూశాడు.

ఒక ఇటిక! ఎక్కడిది?

గుడి మూలలోకి దృష్టి పోనిచ్చేడు!

క్షణం అతనిదృష్టి స్తంభించిపోయింది.

ఉలిక్కిపడ్డాడు. అనంతరం మళ్ళీ స్తబ్ధుడై చూడసాగేడు.

అలా ఎన్ని నిమిషాలు గడిచాయో? క్రమంగా నారాయణరావు భవంతిలో ప్రవేశించాడు. ఇప్పుడతని మొహం నల్లబడింది. అర్థంగాని ఆందోళన—స్పష్టంగాని సంకోచం—ఇంకా ఏమిటేమిటో!—

వడం చావిడిలో పడక కుర్చీ వాల్చుకున్నాడు. నారాయణరావు కూర్చోబోయేడు. కూర్చోకుండానే గదిలోకి వెళ్లేడు. డ్రాయరుదగ్గర పది నిమిషాలు చలనంలేకుండా నిలబడ్డాడు. ఉన్నట్టుండి డ్రాయరు సొరుగు తీశాడు. సొరుగు తీస్తూండగా అతని కళ్లు చెమ్మగిల్లినయ్.

సొరుగులోంచి ఒకటి రెండు పుస్తకాలు అటూ ఇటూ తీసి వానికిందవున్న క్యాలికో బైండుని అందుకున్నాడు. కళ్లకద్దుకున్నాడు. అట్ట వెనక్కి త్రిప్పి ఆలోచనగా మరో నాలుగయిదు పుటలు వెనక్కి త్రిప్పాడు. మరి పుటను కదల్చటం మాని అలా మానులాగై పుస్తకంలోకి చూస్తూవున్నాడు.

కొంతసేపటికి అతని పెదవులు కదలినయ్. ఆ కదలికలో ఒక విషాదావిలమయిన భీతచిత్త ప్రవృత్తి జీరాడింది!.

'అమ్మా!'

అప్రయత్నంగా అతని పెదవులు ధ్వనించాయ్. అప్రయత్నంగానే అతని నేత్రాలు కూడా ఊర్ధ్వాలోకన చేశాయి. గోడమీద చిత్రపటం చిందులాడింది!

నారాయణరావు దృష్టి చిత్రపటంమీద లగ్నమయింది!

'ఏమయ్యేవో! ఎక్కడున్నావో!—నీతోబాటు—రత్నం!—'

నారాయణరావుమనసు మాటాడుతుంది. రత్నం అన్న సంబోధనతో మరా మనసు మాటాడలేక మూగైపోయింది! అతని లగ్న నేత్రాలలో అశ్రువులు వెలువడ్డాయి!

ఇంక అక్కడ ఆగలేకపోయేడు నారాయణరావు. కాలికో బైండు మూసి డ్రాయరు సొరుగులో యథాస్థానంలో వుంచి, కంగారుగా సొరుగు వేసి గోడకేసి చూడబోయి చూడలేక గదిలోంచి గబగబా బైటికి వచ్చేశాడు.

వస్తూనే వీథి కిటికీదగ్గరకు వెళ్ళాడు. కిటికీ తలుపులు తెరిచాడు. గుడివంక చూశాడు. నిశ్శబ్దంగా వుంది. నిర్నిమేషంగా చూశాడు.

గుడిదగ్గర బడిపిల్లలు గుమిగూడినట్టయింది. నారాయణరావు నిశితంగా చూశాడు. నిజంగా గుడి దగ్గర ఎవ్వరూ లేరు. నిశ్శబ్దంగానే వుంది. కాని నారాయణరావు దృష్టిలో గుడిదగ్గర బడిపిల్లలు గుమిగూడేరు. ఆటల సంరంభంలో పడ్డారు. మాంఛి హడావిడిగా పెద్ద సరందావిడిగా వుంది. నారాయణరావు అంతర్దృష్టి బడినుంచి వచ్చే బాటవయిపు ప్రసరించింది. స్పష్టంగా కలకల మొహాలతో కిలకిల నవ్వులతో బడినుంచి వస్తున్న పంతులమ్మా ఆమె భర్తా అతనికి గోచరించారు. తిరిగి నారాయణరావు అంతర్దృష్టి గుడిగోపురంమీదికి ప్రసరించింది. కువకువ ధ్వనులతో పావురాలు బైటికి రావడం దర్శితమయింది.

నారాయణరావు దృష్టి చూస్తోనేవుంది. అంతరాత్మ ఆలోచిస్తూనేవుంది. "ఆఁ! అవిగో—అందంగా ఆనందంతో బైటికి వచ్చాయి పావురాలు! ఎందుకో మగపావురం కొంచెం మందంగావుంది. ఆడ పావురంలో ఒక ఆదుర్దా కనిపిస్తోంది. ఏమిటా వైఖరి?"

నారాయణరావు భావన అలానే సాగుతోంది! "మగపావురాయికి ఏదో వచ్చింది. ఆడ పావురాయి ఆదుర్దాపడుతోంది. ఆహా! అచ్చంగా ఒక ఆడదాని మల్లే ఆ ఆడపావురం ఎంతగా బేలపోతోంది! మగపావురాన్ని చూచి ఆడపావురం పరమసాధ్విలా ఎలా పలకరిస్తోంది! ఆఁ. మగపావురాయి మెడ అలా వాలేసిందే! అయ్యో ఆడపావురాయి బావురమంది. అరే! కింద పడిపోతోంది.

తటాల్న నారాయణరావుఊహ ఆగింది. "ఏమిఁటిది?" అందని లోతునీటిలో ఈతరానివాడిలా ఉక్కిరిబిక్కిరై ఒక్కసారి ఎగసిపడి మరోసారి మునిగిపోతూ కడకు ఎల్లాగో తేరుకొని కళ్లు పెకలించి కిటికీచువ్వల్ని చీల్చుకుంటూ గుడికులాయం వంక చూశాడు. ఏముందక్కడ?

"అరే! పావురాలు బైటికి రానేలేదు. ఎలాంటి దురుహ కలిగింది నాకు! ఎంతటి దుర్భరమైన దృశ్యాన్ని......"

మరి నారాయణరావు మనసు ముందుకు సాగలేదు. యాంత్రికంగా కిటికీ తలుపులు మూసి మెల్లగా అడుగు కదలించాడు.

నడం చావిడిలోకి వచ్చేడు. పడకకుర్చీ పరామర్శించింది. మేను వాల్చేడు. ఎదటి గోడమీదికి చూశాడు. "గడియారం తన గుండెలా కొట్టుకుంటూనే వుంది!" అనిపించింది నారాయణరావుకి. అలా గడియారానికి సహచారిగా కళ్లు అప్పగించాడు. పది...పదిన్నర...పదకొండు...పన్నెండు...ఒంటిగంట...రెండు...మూడు...నాలుగు—

గభాల్న లేచాడు నారాయణరావు. మరుక్షణంలోనే అరుగుమీదికి వచ్చాడు. స్తంభానికి జార్లబడ్డాడు. చుట్టముట్టించాడు. మందంగా మాపు సాగింది.

ఎప్పటిలానే వుంది బాలానందమూ! కోలాహలమూ! యథాపూర్వగానే నారాయణరావు దృష్టి గుడికోటరం వయిపు బడినుంచి వచ్చే బాటవయిపూ ప్రసరిస్తూనే వున్నై. కానంటే గమనంలో మాంద్యం!—

ఆడపావురం బైటికి వచ్చింది. అటు నారాయణరావు దృష్టి నిలిచింది. మగపావురం ఇక వస్తుందని కన్నులు విప్పేడు. ఎప్పటికీ అది రావడం లేదు. నారాయణవు దృష్టి మరి బాటవయిపు మరలడంలేదు. కోటరంనుంచి రావలసిన మగపావురం కోసమే కొనలు సాచుతోంది. ఎప్పటికీ మగపావురం రావడం జరగడంలేదు. నారాయణరావు కళ్లల్లోని నరాలు చిట్లిపోతున్నాయి. మగపావురం మాత్రం బైటికి రావడంలేదు. ఆందోళనగా నారాయణరావు ఆడపావురంవంక తదేకధ్యానంగా చూడసాగేడు. అతని నిశితదృక్కులకే వణికిపోయినట్టుగా ఆడపావురం వణికిపోయింది. అది స్పష్టంగా చూశాడు నారాయణరావు. గమ్మన మధ్యాహ్నం తనకు పొడమిన దురూహ గుర్తుకు వచ్చింది. ఆగుర్తుతో బాటు అతనిగుండెకూడా వణికిపోయింది. అలా సంచలితహృదయంతోనే ఆడపావురంవంక మరీ పరిశీలనగా చూశాడు.

ఆడపావురం రెక్క ఆడించింది!

ఆరెక్క తుద తన ఎదలో మెల్లగా మెదిలి చల్లగా సోకినట్టు తోచింది నారాయణరావుకి!

ఒంటరిగావున్న పెంటిపావురం మళ్ళా రెక్క ఆడించింది! గుండెలో రెక్క ఈసారి విసురుగా దూసుకుపోయినట్టు విభ్రమం కలిగింది నారాయణరావుకి!

ఇతోధికమైన నైశిత్యంతో ఆడపావురంమీదికి దృష్టి సారించాడు. ఆడపావురం కన్నుగుడ్లలో

దైన్యం కనిపించింది. అంతే నారాయణరావు కనుపాపల్లో ఆ దైన్యం కన్నీళ్లని గిలకొట్టింది.

భారంగా అటు చూడలేక నారాయణరావు బడినుంచివచ్చే బాటవయిపు అనుద్దేశపూర్వకంగా చూశాడు.

"అరే! ఆమె ఒక్కర్తే వస్తోంది!" నారాయణరావు గుండె గొణుక్కుంది.

"ఏమిటి కారణం? ఆయనకు పని తెమలక తర్వాత వస్తానని ముందు ఆమెను ఇంటికి వెళ్ళమని వుంటాడు. ఈమాత్రం దానికి విపరీతంగా ఎందుకు భావించాలి!" అనుకుంటూ అనుకోకుండా నారాయణరావు గుడిమీది పావురంవంక చూశాడు. కనుగుడ్లుమూసి మందంగా దీనంగా కుంచించుకుపోయి కూర్చుం దాపావురం!

'ఇదంతా ఏమిటి? మగపావురం ఏమైంది? ఎవరి కిరాతహస్తం ఏంచేసిందో?—'

ఆలోచనలోపడిన నారాయణరావుదృష్టి అల్లనల్లన భారంగా బాధతో బడినుంచివచ్చే బాటవయిపు ప్రసరించింది.

అలతి సమీపంలో నే ఆమె!

సూటిగా చూశాడు నారాయణరావు. చూస్తూనే తలక్రిందులైపోయేడు. 'అరే! ఈఅమ్మాయి ముఖంలో ఎప్పుడూ వుండేకళ ఏమైపోయింది? ... ఈ మేష్టారు ఎందుకు రానట్టు? ఇందాక అనుకొన్నదే హేతువయితే ఈమెలో దాగివున్న దైన్యానికి కారణమేమిటై వుంటుంది? అతని గురించే ఆమె బాధ అలా కళ్ళల్లో ప్రతిఫలిస్తూ ముఖంలో ముసురుకుందేమో! అడిగేస్తే?—.'

అడుగుదామనుకున్నాడు నారాయణరావు. పెదవి కదిపేడు. 'తీరా అడిగితే ఏమనుకుంటుందో? ఒంటరిగా వస్తున్న యువతి! భర్త లేకుండా చూచి మీ ఆయన నీకూడా రావడంలేదేం అని ఎంత మంచి హృదయంతో అడిగినా ఎలాంటి కాలుష్యమైనా ఆమె ఆపాదించుకోవచ్చు' అనిపించి నారాయణరావు పెదవి మరి కదలించలేకపోయేడు.

'అడగకపోతే అసలు జరిగిందేమిటో ఎలా తెలుస్తుంది? ఆమె బాధ ఏమిటో? ఆ పావురం ఎంతగా విలవిలలాడిపోతోంది! అలాగే ఈమె హృదయమూ ఎంతగా దహించుకుపోతోందో పాపం! అడిగితేనే మంచిది. ముందు తన ఆరాటం సడల్తుంది. తర్వాత...'

సరిగ్గా భవంతిముందుకు వచ్చిందా పంతులమ్మ. మాసిన దుకూలంలో నైగనిగ్యంలా కలకబారిననీటిలో స్వచ్ఛందతలా గత సందర్భంలోని కిలకిలలూ గలగలలూ నారాయణరావు హృదయాంతరంలో ఎక్కడో మెదిలినట్టయినయ్.

ఒక్కడుగులో ఆమె భవంతి ప్రాంగణాన్ని అతిక్రమించి వెళ్ళిపోతుంది. అడగాలి!—

నారాయణరావు హృదయం ఉయ్యాలలూగింది. బలవంతంగా పొడిబారిపోయిన పెదవిని తెరవబోయేడు. పెదవులు వణికినయ్. పట్టుబట్టి హృదయోద్వేగాన్ని అణచుకోబోయేడు. స్వాధీనం అవడం కష్టంగా వుంది. అలానే 'అమ్మా!' అన్నాడు. ఆ రెండు అక్షరాలూ అతని పెదవులు దాటి రాలేదు. అందుకు సిగ్గుపడి ఆమెవంక చూశాడు. ఆమె అప్పుడే భవంతి ప్రాంగణాన్ని దాటేసింది!

ఆమెవైపు నారాయణరావు దృష్టి నిశ్చలంగా నియతమైపోయింది!

నిమిషాలు గడిచాయి.

పంతులమ్మ మలుపు తిరిగింది.

నారాయణరావు చూపులు నిస్పృహతో నీరసంగా గుడి కోటరం వయిపు ప్రసరించినయ్.

ఆడపావురం అలా దీనంగా నేవుంది!

6

మనస్సు వికలమయింది.

భావశకటం శకల శకల మయింది.

మనోభావ సకలం వికలశకల మయింది.

మర్నాడు కూడా నారాయణరావు స్వయంపాక ప్రయత్నం మాని వ్యథిత హృదయంతో శూన్యదృక్కులతో వీధిచావిడిలో కూర్చున్నాడు.

ఎదురుగా ఎప్పటిలా గుడివుంది. ఎవ్వరూ అక్కడికి వచ్చిన అలికిడి లేదు.

మధ్యాహ్నమయింది. గడియారం ఠంగ్ న రెండు కొట్టింది. కూర్చున్నవాడల్లా లేచి గదిలోకి వెళ్ళాడు. క్షణం గోడవయిపూ క్షణం డ్రాయరు వంక చూస్తూ కొన్ని క్షణాలు గడిపాడు.

మెల్లగా డ్రాయరుమీదున్న డైరీపుస్తకం తీశాడు. అక్కడే కూర్చున్నాడు. కలం పుచ్చుకున్నాడు. అయిదారుపుటలదాకా వ్రాశాడు.

గడియారం అరగంట కొట్టింది. నారాయణరావు చెవిని బడింది. వీథిచావిడిలోకి వచ్చి మళ్ళా పడకకుర్చీలో వాలిపోయేడు.

మూడు...మూడున్నర...

ఠంగ్! ఠంగ్! ఠంగ్! ఠంగ్!

గడియారం నాలుగు గంటలూ కొట్టింది. ప్రతి శబ్దానికీ నారాయణరావు మొహంమీద సమ్మెటదెబ్బ పడుతున్నట్టుగా ఉలికిపడుతూ ఉలికిపడుతూ ఉద్విగ్న హృదయంతో లేచేడు. అరుగుమీదికి వచ్చేడు.

నిమిషాలు నిర్జీవంగా గడుస్తున్నాయి. గుడి దగ్గర బడిపిల్లలు గుమిగూడేరు.

ఒక్కసారి వాళ్ళమీద పడింది నారాయణరావు దృష్టి. అందులో ప్రత్యేకించి ఒక ఆరేళ్ళ కుర్రాడిమీద. గోడగడియారం లోపల అరగంట కూడా కొట్టింది. ఆలయంవంక చూశాడు నారాయణరావు!

ఆడపావురాయి కూడా అగుపించలేదు.

అల్లాగే చూస్తున్నాడు.

ఠంగ్‌న మళ్ళీ లోపల అయిదుగంటలు వినిపించాయి! నారాయణరావు చూపులు అటు ఆలయంమీదికీ ఇటు బాటవయిపూ తడబడుతూ ప్రసరిస్తున్నయ్.

అయిదున్నర! ఆరు! ఏడు!

బాటను ఒక్క పిట్టవచ్చిన జాడలేదు. నారాయణరావు మరింత బాధపడసాగేడు. అనేకవిధాలుగా అంతరాత్మ ఆక్రోశించింది. ఆక్రోశిస్తోంది! ఏముంది సమాధానం? ఎవరిస్తారు?—

ఒకొక్కరే ఇంటిమొహాలు పడుతున్న బడిపిల్లలవంక చూశాడు నారాయణరావు. సందడి సన్నగిల్లుతోంది. ఆడి ఆడి, పాడి పాడి, అలసి సొలసి ఆ బడిపిల్లలు నీరసంగా అడుగులు కదుపుతున్నారు!

'ఏయ్ అబ్బాయ్! మాట!'

అక్కడ మిగిలిన అయిదారుగుర్ని ఉద్దేశించి ఎవ్వరో ఒక్కరు పలుకుతారన్నట్టుగా నారాయణరావు పిలిచాడు.

ఆ పిలుపుకి కుర్రాళ్లు తెల్లబోయేరు. 'అల్లరి చేస్తున్నారా? మీకు చదువూ సంధ్యా అక్కరలేదూ?' అని పెద్దాళ్లు తిట్టడం వాళ్ల చెవుల్లో గింగురుమంది. నారాయణరావూ అలాంటి పెద్దవాడే! అందుకే పిలుస్తున్నాడు కాబోలు! అని పిల్లలు వెర్రిమొహాలు వేసి చూడసాగేరు. ఒకడు మాత్రం తెగించి 'ఏవండీ!' అంటూ అరుగుదాకా వెళ్లేడు!

'ఏం చదువుతున్నావు నాయనా!'

'మూడో కలాసండి!'

'అలాగా! మీ మేస్టారు ఎవరు?'

'మాకు మేస్టారు కాదండి. పంతులమ్మగారండి.' ఆ కుర్రాడి మాటలకి వచ్చిన నవ్వు వచ్చినట్లే లోపలే అంతరించిపోయి అదే వైఖరితో నారాయణరావు అడిగాడు.

'ఇవాళ మీకు ఏం పాఠం అయింది?'

'ఏవీఁ అవ్వలేదండి. ఇందుకేనా పిలిచారు. పొద్దుపోయింది. పోతాను.' అంటూ ఆ కుర్రాడు తోక జాడించబోయేడు. 'మాటబ్బాయ్! పనివుంది! ఇదిగో! నిన్నే. ఇలా చూడు.' అంటూ నారాయణరావు బలవంతంగా ఆ కుర్రాణ్ణి ఆపుచేశాడు.

'ఎందుకండీ?'

పెద్ద చనువున్నవాడల్లే అమాయికుడా కుర్రాడు అడిగాడు. అందుకు సంతోషమే అయినా ఆ అనుభూతి కూడా కలుగుతూనే మాయమయింది నారాయణరావులో!

'ఇవాళ మీకు పాఠాల్లేవా?'

'కాదండి. పంతులమ్మగారు రాలేదండీ!' అని సాగదీస్తూ నారాయణరావు అడిగినప్రశ్నకి ఏవీఁటింత తెలివితక్కువతనంగా అడుగుతాడీయన అన్న అరిందాతనంకొద్దీ ఆ అబ్బాయి నవ్వేసి 'ఒరేయ్ ఒరేయ్!' అంటూ రోడ్డుమీదికివచ్చిన కుర్రాళ్లలో కలిసిపోయేడు.

"పంతులమ్మకూడా పాఠశాలకు రాలేదూ? కారణం? —" ప్రశ్నపాతం పాశుపతంలా పని చేసింది. నారాయణరావు జారిపోతున్న నాడుల్ని చేదుకుంటూ గుడివంక చూశాడు.

సడి, సవ్వడి, లేని గుడికోటరం చుట్టూ, నడిరేయి నాట్యమాడినట్టయింది!

7

అరుగుమీద నారాయణరావు కనిపించక పోవడంతో ఆదార్ని నీలాటిరేవుకి వెళ్లే అమ్మలక్కల ముక్కులమీద మళ్ళీ వ్రేళ్ళు మొలిచాయి!—

'మూడురోజులనుట్టి బయటికే రాడేమో!—ఒకావిడ శ్రుతిసవరించగానే 'మరేపాపం, ఇంట్లోవుంటేగా!" అంటూ అంతవరకల్లా తొలగే తొయ్యలులలో ఒకర్తె అయినావిడ అందుకుంది. 'ఏమిఁటంటావే కారణం?' మరోఆవిడ ముందు నడుస్తున్నావిణ్ణి అడిగింది. 'నాకేం తెలుసునమ్మా నాయకుడుగారి గొడవ!' అంటూ అసూర్యంపశ్యత్వాన్ని చాటుకొంది ఒక ఉవిద, నడివీధిలో!—అలా వారు భవంతిని దాటి నీలాటిరేవుకి నడిచారు. కాస్సేపటికి వారి తిరుగుప్రయాణంకూడా అయింది!

మరో అరగంట కాలహరణమయింది.

నారాయణరావు వచ్చేడు. మెట్లమీదనుంచి వెనక్కి తిరిగి ఆలయంవంక చూచి అరుగుమీదికి వెళ్లేడు. అయిదునిమిషాలు అరుగుమీదే నిలబడ్డాడు.

"మూడురోజులయింది! గుడి మరమ్మత్తుపని మొదలుపెట్టలేదు. సాయంత్రం వస్తానన్న మున్సబు మళ్లీ కనిపించలేదు. వాకబు చేస్తే అర్జెంటుగా గ్రామాంతరం వెళ్లారని మాత్రం వర్తమానం వచ్చింది. కరణంగారు అంతకంటె కంటికి కరువైపోయేడు! ఒకవేళ ఇంటికి వచ్చి వెళ్ళిపోతున్నారేమో! నేనూ ఇంటిపట్టున ఉండటం లేదు సరిగా! ఆ మేస్టారికి రోగం ముదురుతుందే కాని నయమయ్యే దారి కనిపించడంలేదు. అసలే ఇది కుగ్రామం. గచ్చాకూ పచ్చాకూ వైద్యాలు కాదని ఆచారిగారిచేత ఆయుర్వేద ఔషధాలు ఇప్పిస్తే అవంతకంటే గుణమివ్వకండా వున్నై!

నారాయణరావు గుండె ద్రవించింది! తల తిప్పడంలో గుడి కనిపించింది. ఎప్పటిలానే వుంది!—

'పావురాలను చూచీ మూడు రోజులయింది! అవెల్లా గున్నయ్యో! ఇప్పుడవి బయటకు రానేరావు. అవి వచ్చే వేళకి రాడానికి పడటంలేదు. ప్రతిక్షణం మేస్టారి పరిస్థితి ప్రమాదమనిపిస్తోంది!'

అనుకొని నారాయణరావు వీధి తలుపు తాళం తీసికొని లోపలికి వెళ్లేడు. వీధిచావిడి విశాలంగా కుర్చీలతో వుంది! సమ్మార్జనం లేక దుమ్మూ ధూళీ ఫర్నీచర్ని కప్పివేస్తోంది!

నారాయణరావు మరో గుమ్మం దాటేడు.

నిశ్శబ్ద వాతావరణంలో గోడగడియారం టక్ టక్‌మని కొట్టుకొంటోంది! గడియారంవంక చూశాడు నారాయణరావు. 'అబ్బా! అప్పుడే ఆరున్నర దాటిపోయింది!'—హడావిడిగా నారాయణరావు గదిలోకి వెళ్లేడు. డ్రాయరు సొరుగు తీశాడు. పై పుస్తకాలు చెదిరివుండటంవల్ల కేలికోబైండు కనిపించింది! నారాయణరావు దృష్టి గోడమీదికి ప్రసరించింది! చిత్రపటం వెలవెలబోతూ తోచింది. గుండె గతుక్కుమని నారాయణరావు కాలికోబైండు తెరవడానికని సొరుగులోకి చేయి సాచేడు. మనస్కరించలేదు. మానేశాడు. మానులా అలా కొంతసేపు నిలబడి క్రమంగా వసారాలోకి వెళ్ళేడు!

ప్రొద్దుటి పదార్థాలు! రసనకి రుచించలేదు. మనసుకే సహించలేదు. అటూ ఇటూ అన్నం కలిపి తినకుండానే లేచిపోయి నారాయణరావు చేయి కడుక్కున్నాడు. నిర్వికాస దృక్కులతో మెల్లగా వీధిచావిడిలోకి వచ్చేడు. పొగాకు గొట్టం తీశాడు. చూడకుండానే చుట్ట చుట్టడమయింది. అగ్గిపెట్టె గీచి అంటించాడు. అలవాటైన చుట్టకూడా కాల్చాలనిపించలేదు. కంటిముందు మంచంమీదున్న మేస్టారు మాత్రం కదులుతూ రొప్పుతూ రోజుతూ వున్నాడు.

ఎనిమిదయింది!

'నారాయణరావుగారూ!'

వీధిలో కేక వినబడింది.

'ఎవరు?' అంటూ నారాయణరావు వీధితలుపులు తెరిచాడు. మున్సబూ కరణంగారూ ఒకరిద్దరు గ్రామీణులూను, కూడా తాపీ మేస్త్రీలూను!

'లోపలికి రండి.' అన్నాడు నారాయణరావు.

కొందరు కుర్చీలు కొందరు బల్లలు సర్దుకొన్నారు. నాయణరావు మాత్రం నిలబడే వున్నాడు.

'నారాయణరావుగారూ! మనవాళ్ళంతా సిద్ధంగా వున్నారు. డబ్బుగురించి మనం ఆలోచించనక్కరలేదు. పోతే ఏవిధంగా మనం గుడిని మరామత్తు చేయాలో మాత్రం ఆలోచించాలి.' అంటూ మున్సబు మొదలుపెట్టాడు.

'ఆ విషయం మనకంటె ఏ వాస్తు శాస్త్రజ్ఞుణ్ణో అడగటం శ్రేయస్సని నా యోచన. తర్వాత మీ యిష్టం.' అన్నాడు కరణం.

'శాస్త్రాన్ని బట్టి నిర్మించడానికేం?"

'అహఁ—అయినా మనమంతా ఏకస్థులమై అనుకోడం ఉభయత్రా శ్రేయస్సని!' అని కరణమే అన్నాడు.

'అలాగే మీ యిష్టం!' అంటూ పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు నారాయణరావు.

'శాస్త్రాలదాకా ఎల్లడానికి ఇదేమంత పెద్ద గుడీ! ఉన్నపళంగానే అటో ఇటో కట్టించేస్తే సరి!' అన్నాడు ఆగంతుకులలో ఒకడయిన సర్రయ్య.

'అంతే. పెద్దంత ఎవ్వారమెందుకు?' అన్నారు తలిమా వాళ్లు.

'ఏ దెలావున్నా మనకి గుడి అందంగా చూడ ముచ్చటగా తయారవ్వాలి!' అంటూ మున్సబు నారాయణరావువంక చూశాడు.

నారాయణరావు సాభిప్రాయంగా తాపీమేస్త్రీల వంక చూశాడు.

'సాలా పనుందండి. కొత్తగోపరవేఁ కట్టించాలి మరి!' అన్నాడొక మేస్త్రీ.

'ఇంతా పనిచేసి అదట్టే పెడతామా?' అన్నాడు రెండో మేస్త్రీ.

'పాతరాజయినా కొత్త కిరీటం వుండాలి!' అన్నాడు కరణం.

'కొత్త గోపురమా?'

ఒక్కసారి ఉలిక్కిపడి చూశాడు, నారాయణరావు.

అన్ని తలలూ అవునంటూ ఆడాయి!

'బొమ్మలూ మెట్లు ఉన్నట్టే బాగుచేయిస్తే సరిపోదూ?' అందరివంకా చూస్తూ నారాయణరావు అడిగాడు.

'అబ్బే!' పెదవులు విరిచారు పెద్దలు. భీమ శంకరం మున్సబువంక చూశాడు. మున్సబు సర్రయ్య వంక చూశాడు. సర్రయ్య మేస్త్రీవంక చూశాడు.

'అలాగేం బాగుంటాది బాబూ! మీరీ యింటికి ఈ హంగు ఎందుకన్నారు. సూడండి కట్టేక మీరె చాలా బాగుందోయ్ శరభయ్యా! అన్నారు. అల్లాంటి మాట రావాలని మా అఘోరం.' అన్నాడు మేస్త్రీ రెండోవాణ్ణి 'కదరా?' అన్నట్టు చూస్తూ.

'అయితే—'

హృదయం పగిలికూడా గొంతుక విడివడక నారాయణరావు అర్ధోక్తితో ఆలోచనగా అందర్నీ చూస్తూ కుర్చీలో ముందుకు వంగేడు. ఎలాంటి సమాధానం వస్తుందో అని అంతా నోళ్ళావలించి చూస్తున్నారు. ఎలాంటి మాటా మళ్లా నారాయణరావు అనలేదు. అంటాడనే అంతా ఆశగా చెవులు నిక్కించారు.

"బాబూ! బాబూ!"

గబగబా ఓ పదేళ్ల కుర్రాడు గదిలోకి వచ్చేడు.

'ఎవరికోసంరా?' అన్నాడు కరణం. ఆ మాట వినపడలేదు కుర్రాడికి. తిన్నగా బాబూ! బాబూ! అంటూ నారాయణరావుదగ్గరకు పరుగెత్తుకు వెళ్లేడు. ఆ కుర్రాణ్ణి చూడగానే నారాయణరావు కంగారుపడి లేచి, 'ఏం?' అన్నాడు.

'మేట్టారికి, మేట్టారికి!'

కుర్రాడు అదేపనిగా ఒగురుస్తూ మాటాడలేక పోతున్నాడు. సముదాయింపుస్వరంతో 'ఫర్వా లేదమ్మా. చెప్పు' అన్నాడు కుర్రాణ్ణి నారాయణరావు.

'బాగా ఎక్కువై—'

'ఊఁ?'—ఉలిక్కిపడ్డాడు నారాయణరావు.

'ఏదోలా వుందటండి.'

'ఆఁ!' — నారాయణరావు వ్యాకులాన్ని పొందేడు.

"అమ్మగోరు మిమ్మల్ని—" కుర్రాడు మాట పూర్తి చేయకండానే

'రమ్మన్నదా?' అంటూ నారాయణరావు గభాల్న ముందుకు కాలుసాచేడు. మున్సబు కనిపించాడు. అడుగు వేయబోతూనే అందరివంకా చూశాడు. 'ఇప్పుడే వస్తా' అని నాలుగైదు అడుగులు వేశాడు. తాపి మేస్త్రీ దండకట్టె నిలబడటాన్ని చూశాడు. మేస్త్రీని చూడగానే నారాయణరావు ఆగిపోయేడు. ఏదో చెప్పబోతాడు. ఎందుకో ఆరాటం. ముందు వెళ్లాలని కంగారు. వెళితే ఇక్కడ ఏమిటవుతుంది? అందర్నీ కాదని వెళ్ళడమా? అని అనుమానం. ఏం చెయ్యాలి? ఆలోచించడానికూడా నారాయణరావుకి ఊపిరాడలేదు. ఎదురుగా మేస్త్రీ!

"పావురాలు! పావురాలు!"అంటూ నారాయణరావు గబగబా బైటికి నడిచాడు. మెట్లు దిగాడు. వెనకాల కుర్రాడు. ముందు నారాయణరావు. జోరుగా నడక. మధ్యమధ్య తూలిపడుతూ కూడా!

నారాయణరావుధోరణికి నలుగురూ ఆశ్చర్య పోయేరు. ప్రశ్నార్థక చిహ్నముఖాలతో అరుగుమీ

దికి వచ్చేరు. కరణంలో మాత్రం ఎలాంటి విస్మయమూ పొడకట్టనట్టు స్పష్టంగా తెలుస్తోంది! మున్సబు ముక్కుపుటాలు ఎగురుతున్నాయి!

'ఏమిటండీ యిదీ?' సంబాళించుకొంటూ సత్రయ్య అన్నాడు.

'ఇంకేం వుంది?' అంటూ కరణం అందరి వంకా అదోలా చూశేడు.

'అంతేనంటారా?' మరొకడు అడిగాడు.

'కాక?' కరణం గద్దించి అన్నాడు.

'అరె! ఎంత దుర్మార్గం!' నోరు వెళ్ళబెట్టేడు సత్రయ్య!

'పావురాలని పలవరిస్తాడేమిటి?' మున్సబు గుంజుకున్నాడు.

'వాడి మొహమూ అహమూ!' అన్నాడు కరణం.

'సరే!—'

పైక్కనిపించకుండా పళ్ళు బిగించి కళ్ళు పెద్దవిచేస్తూ మున్సబు ముఖమాడించాడు. అప్పుడతన్ని చూస్తున్న సత్రయ్యకి భయం వేసింది. కాస్సేపు కిక్కురుమనలేకపోయి గుక్కతిప్పుకొని 'ఇక్కడెందుకు మనం ఇంటి కాపలా!' అన్నాడు.

'పనిలేక!' కరణం కాలు కదిపాడు.

'తలుపు గొళ్ళెమయినా పెట్టండి బాబూ!' అన్నాడు తాపీ మేస్త్రీల్లో ఒకడు!

'పదండి.' మున్సబు గర్జించాడు.

8

నారాయణరావు తిరిగి ఇంటికి వచ్చేసరికి తూరుపు తెల్లవారుతూవుంది. రాత్రల్లా నిద్రలేక మొహం వాడిపోయి నిద్ర ముద్ర వేసికొంటూవుంది. రెప్పలు మూసుకుపోతున్న కళ్ళు ఎరుపెక్కి నివురు గప్పుతున్న చింతనిప్పుల్లా అయినయ్.

ఆలయందగ్గర అప్పుడే తాపీమేస్త్రీలు పని ముట్లతో వచ్చి గుడిని పరకాయిస్తున్నారు. వాళ్లని చూచి వాకిట్లోనె ఆగిపోయేడు నారాయణరావు. 'పని మొదలుపెడుతున్నారా?'—మేస్త్రీల వంక చూస్తూ ప్రశ్నించాడు.

'మరేనండి.' అంటూ శరభయ్య నారాయణరావు భవంతి వాకిట్లోకి వచ్చేడు.

'ముందు చీడీలు పడగొడతారా?'

'పైని గోపురం ముందు పడగొట్టాలండి!'

నారాయణరావు గోపురంవంక చూశాడు. సరిగ్గా కోటరం కనిపించింది. క్షణం నారాయణరావు స్తంభించిపోయేడు. గుండెలో రాయిపడినట్టు కలికిల పడ్డాడు.

'శరభయ్యా!' హీనస్వరంతో తాపీ మేస్త్రీని పలకరించాడు.

'అయ్యా!'

నారాయణరావు చూపుడు వేలెత్తాడు. అది కంపించసాగింది. అలా వణకుతున్న తర్జనితోనే 'ఆ గూటిలో రెండు పావురాలు ఉన్నయ్. ముందు వాటిల్ని జాగ్రత్తగా బైటికి పోనివ్వండి—' అని రుద్ధకంఠంతో అని గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయేడు నారాయణరావు.

పడక కుర్చీమీద నారాయణరావు కూర్చున్నాడన్న మాటేగాని అతని మనసంతా పావురాలమీదే వుంది. ఒకవంక నిద్ర ముంచుకువస్తోంది. 'సరిగ్గా వాళ్ళు పావురాల్ని బైటికి పంపిస్తారో లేదో! వాళ్లకేం పట్టింది? అంతగా వస్తే వాటిని అమాంతం చంపి ఆరగించేందుకు సిద్ధపడే మనుషులు! ఎందుకైనా మంచిది! స్వయంగా వాటిని—'

నారాయణరావు కుర్చీలోంచి లేచేడు. అరుగు మీదికి వచ్చేడు. ఆలయగోపురంమీద తాపీ మేస్త్రీ ఆపసోపాలు పడుతున్నాడు.

'ఏమోయ్ శరభయ్యా!' అంటూ అరుగు దిగి నారాయణరావు ఆలయందగ్గరకు వెళ్ళాడు. 'అయ్యా! ఒకటే పావురముండి. ఇలా నేను వచ్చి చప్పుడు చేయగానే తుర్రున ఎగిరెళ్లిపోయింది. రెండో పావురాయి ఉన్నట్టు లేదండి' అన్నాడు శరభయ్య. 'సరిగా చూడవోయ్' హెచ్చరిక చేశాడు నారాయణరావు. 'లేదండి!—' అప్పుడే దిగే ప్రయత్నంలో కనిపించాడు శరభయ్య. రాతిబొమ్మలా నిలబడి చూస్తున్నాడు నారాయణరావు. గాజుపలక మీద నీడలా శరభయ్య దిగిరావడం కనిపించింది. తర్వాత తాపీ మేస్త్రీలిద్దరూ ఏదో మాటాడుకున్నట్టు లీలగా మూగబొమ్మల పెదవులు కదిలినట్టుగామాత్రమే తోచింది నారాయణరావుకి.

ఖంగ్‌న శబ్దమయింది.

త్రుళ్ళిపడిచూశాడు నారాయణరావు. తెల్లగా మెరుస్తూ బలంగా గుడిగోపురంమీద గునపం పడింది. తన గుండెల్లోనే గునపం దిగబడినట్టు అణగిపోతూ మరి అక్కడ నిలబడలేక కాలు కదిపాడు నారాయణరావు.

'రెండో పావురం ఏమయింది? ఆ రెండో పావురం ఆడదా? మగదా?' అన్న ఒకటే ఆలోచనతో ఆందోళనతో తల దిమ్మెక్కిపోయి పడక కుర్చీలో కూలబడ్డాడు నారాయణరావు ముంచుకు వస్తున్న నిద్ర ఏమైపోయిందో పాడు కన్నులు పడ్డాయి! మరిచిపోగలుగుతామన్న భావం మధ్య మధ్య కలిగి బలవంతంగా కళ్లు మూస్తున్నా నిద్ర రావడం లేదు. పరంపరగా గుడిమీద పడుతున్న గునపాల ధ్వని నారాయణరావు గుండెల్లో ఖంగ్ ఖంగ్ మంటోంది!

"ఆ పావురం గూటిలోనే వుందేమో! కొంప దీసి గునపం పోటు పావురం గుండెలో పడదుగదా? పడితే......ఇస్......పచ్చని ప్రాయం. మెత్తని మేను......చితికి చితికి...అబ్బ! పసి నెత్తురు..."

ఊహించలేకపోయేడు నారాయణరావు కళ్లు తిరిగాయ్. వమనం వచ్చినంత పనయింది. గభాల్న కుర్చీలోంచి లేచేడు. గదంతా కాలు గాలిన పిల్లిలా కలియదిరుగుతూ ఉన్నట్టుండి కిటికీదగ్గరకు వెళ్ళి బైటికి చూశాడు. ఓమూల గోపురం కూలగొట్టబడింది. కోటరం వున్నవయపుగాక అవలివైపు ప్రస్తుతం కూలగొడుతున్నారు. ఇప్పట్లో ఫర్వాలేదు. కాని కాస్పేపటికయినా తప్పదుగా ఆ కళ్యాణం!...పిలిచి వాళ్ళకి మళ్ళీ హెచ్చరిస్తే మంచిది—అనిపించి నారాయణరావు కిటికీదగ్గర్నుంచి వీధి గుమ్మంలోకి వచ్చి తలుపు తెరిచాడు.

మెట్లెక్కుతూ కరణంగారు కనిపించారు. 'నారాయణరావుగారూ!' ఆప్యాయంగా కంఠం ఆహ్వానించింది. 'రండి.' అన్నాడు నారాయణరావు. అరుగుమీదికి వచ్చి భీమశంకరం వెనక్కి తిరిగి 'నానుస్తూ చేయకండోయ్ పని. తొందరగా కానివ్వండి.' అని మళ్ళీ నారాయణరావువయపు తిరిగాడు.

భీమశంకరం ప్రవేశంతో నారాయణరావు లోపలికి దారితీశాడు. వీధి చావిడిలోనే ఇద్దరూ కూర్చున్నారు.

'అలా వున్నారేవండీ?' కుశలప్రశ్న వేశాడు భీమశంకరం.

'అబ్బే. ఎలా వున్నాను?' బాగానే వున్నానన్న భావాన్ని ప్రకటించాడు నారాయణరావు.

'దేనికయినా నారాయణరావుగారూ! ఒక అవధి వుండటం మంచిది సుమండీ!' అన్నాడు కరణం.

'దేనికయినా అంటే?'

'దేనికయినాను.'

'మీరనే దేవిఁటో!—'

'అబ్బే! నేనుగా అనేది మీ విషయంలో ఎప్పుడూ ఏమీవుండదు. కాని చూడండి. వాళ్ళు ముక్కూ మొహం తెలీనివాళ్లనికాదు. మనవూరా? మన మంచా? అని.'

'ఎవరిమాట!'

'ఆ మొగుడూ పెళ్ళాలే నండి.'

'ఏ మొగుడూ పెళ్ళాలు?'

'సరే! ఏవీఁ తెలీనట్టు అంటారుగాని మీరు ప్రతిక్షణం అక్కడ జాగరం చేయడం లేదుటండీ?'

'ఎవరు ఆ మేస్టర్లమాటా?'

'మరేనండి.'

'వారు దంపతులు కారే!'

'ఏవిఁటీ?' కరణం తెల్లఫ్రేము కళ్లజోడు తీస్తూ మొహం విప్పేడు.

'ప్రణయజీవులు!'

'ప్రణయజీవులా?' కొంప మునిగిపోయే ప్రమాదమన్నట్టుగా పలికాడు కరణం.

'ప్రేమ. పత్నులంటే మరీ అర్థవంతం!' నిండుగా నిర్మలంగా అన్నాడు నారాయణరావు.

'పత్నులా?' ఈసారి కళ్ళీ ఊడదీసుకుంటూ ఉలిక్కిపడ్డాడు కరణం.

'ఆఁ!' నిర్ధారణగా నిష్కర్షగా తల ఆడించాడు నారాయణరావు.

'బాగానేవుంది. పనికిరాని వెధవని మనం పక్షే అంటాం.' అంటూ కుర్చీలోంచి ఎదటికి లేచిన భీమశంకరం వెనక్కి వాలసాగేడు.

'మనం అనే మమకారం అన్ని విధాల అతీతుల మనుకొనే అహంకారం కల మానవులకంటె ఆపక్షులే నయం. నిష్కాపట్యం, స్వచ్ఛత, స్వచ్ఛందత అనే అంశాలు——వాటికి అవగాహన అయినట్టూ అనుక్షణం ఆచరణలో అచ్చొత్తించేటట్టూ మానవులకు అర్థం గానట్టీ అందనటువంటీ పదార్థాలు !'

నారాయణరావు గంభీరంగా అనేసరికి భీమశంకరం ఒక్కసారి ఒదిగిపోయేడు. కాని బురద పాములా బుసకొడుతూ పైకి లేచేడు.

'క్షుద్రాలయిన పశువులూ పక్షులే మనకి ఆదర్శాలంటారు?' అన్నాడు కొంచెం తీవ్రంగానూ తన ఆత్మకేదో అన్యాయం జరిగిపోయినట్టూను.

'నిజానికి తిర్యక్కులకంటె మనం అధికులమే! కాని అవలక్షణాలు బాగా అంటువ్యాధుల్లా వ్యాపించిపోతున్న మానవలోకంలో అవే నయమనిపిస్తాయి !'

'అలాగాండి ?' అవహేళనాత్మకంగా అడిగాడు భీమశంకరం. అంత ఇంతలో చలించే మనస్వి కాని నారాయణరావు మంద గంభీరస్వరంతో ప్రారంభించేడు. 'కరణంగారూ ! ఒక సంగతి చెబుతా వినండి. నేనీ భవంతిలో ఏకాంతవాసం మొదలు పెట్టినప్పట్నుంచి చూస్తున్నా. మన శిథిల దేవాలయం జీర్ణకోటరంలో రెండు పావురాలు కాపురముంటున్నయ్. వాటికి ఎంత సామరస్యం ! ఎన్నో నేర్చిన మనకు మల్లే వాటికి సూత్రబంధాలూ కళ్యాణవేదికలూ లేవు. పైగా పక్షిజాలంలో ఫలానాదే భర్తృపక్షి. ఫలానిదే భార్యాపక్షి అన్న విచక్షణ ఉందని ఎలా చెప్పగలం? ఎక్కణ్ణుంచో వస్తాయి! మరెక్కడో ఆగుతయ్. అంతకు ముందా ఆడ పావురం వివాహితేమో అని మగపావురానికిగాని—— ఏమో మగపావురం దక్షిణ నాయకుడవునో కాదో అని ఆడపావురానికి గాని ఆలోచనా పాలోచనా? కలుసుకున్నప్పటినుండి హాయిగా మాత్రం అవి జీవిస్తాయి. అలాంటి అనుబంధం మనలో ఎక్కడ వుంది? ఎన్నెన్ని అనుమానాలు? అసహనాలు? ఈర్ష్యలూ? ఉద్రేకాలూ ఉన్మాదాలూ? అవి మానవుల్ని ఆవరించుకున్న ఏ భూతప్రేత పిశాచాలో! —'

నారాయణరావు గడగడ చెప్పుకుపోతుంటే భీమశంకరంపని ఉక్కిరిబిక్కిరయింది. గుడిఇటుకల్ని బైట గునపాలు దొలుస్తున్నట్టే తన గుండెల్ని దొలుస్తున్నట్టయింది భీమశంకరానికీని!

'నారాయణరావుగారూ!' అని మధ్యలో జోరుగాపోతున్న బండికి బ్రేకు వేశాడు.

'మీవి పాశ్చాత్య భావాలు!' భీమశంకరమే అన్నాడు.

'అయితే?'

'పారతంత్ర్యం పోయినా పరకీయమైన నాగరికతా వాసనా మీకు పోలేదు. ఆ సంస్కారాన్ని మాకు అంటగడదామని ఆలోచిస్తున్నట్టున్నారు!'

'ఆ స్థాయి లేని ఈ కుగ్రామంలో నూతన సంస్కారం తీసుకురావడం సులభసాధ్యం కాదు.'

'అసాధ్యం కూడా!' బెబ్బులి గాండ్రించినంతగా గావుకేక పెట్టాడు భీమశంకరం.

నారాయణరావు చిన్నగా నవ్వేడు. చివాల్న లేచేడు భీమశంకరం. 'నారాయణరావుగారూ! మున్సబూ వాళ్ళూ మిమ్మల్ని అకారణంగా అపార్థం చేసికొంటున్నారని మీకేదో చెబుదామని వచ్చేను. మీ తత్వం అర్థమయింది. సంతోషం. మరింక సెలవ్' అంటూ కాలు సాచేడు.

'ఆగండి కరణంగారూ!' అంటూ నారాయణరావు లేచేడు. అవతల గునపాలు రణగుణ ధ్వని చేస్తునేవున్నై! భీమశంకరం ఆగేడు.

'మున్సబే కాదు. మీరూ నన్ను అపార్థమే చేసికొంటున్నారు.'

'నేనా?'

'కాదా?' నారాయణరావు మందహాసం చేస్తూ అన్నాడు. ఆనవ్వు రాయిరువ్వినట్టుగా భీమశంకరాన్ని గాయపరిచింది. నారాయణరావు అలా చిరునవ్వుతో కళ్లు చికిలిస్తున్న కరణంవంక చూస్తూ నేవున్నాడు.

కరణానికి ఒళ్లుమండింది. 'ఆ ముండదగ్గరికి వెళుతున్నాడు నారాయణరావు అని అంతా అంటే నమ్మలేకపోయేను అమాయకుణ్ణి.' అంటూ అడుగు వేశాడు కరణం.

'భీమశంకరంగారూ!' పెద్ద కేక వేశాడు నారాయణరావు. అమాంతంగా అతని నవ్వుమోములో విస్మయరేఖలు విరిశాయి. త్రుటిలోనే విస్మయ ముద్రల్లో విషాదరేఖలు ముసురుకున్నయ్. విసురుగా కరణం వీధి గుమ్మందాకా వెళ్లి ఆగి నారాయణరావు వంక చూశాడు. అసహ్యంగా తలదిప్పుతూ 'అలాంటి నక్క వినయాలూ శ్రీరంగనీతులూ ఎంతో కాలం సాగవ్. జింకచర్మం కప్పుకున్నా అది జింక కాదు.

సింహం అని తెలిస్తే ఎవ్వరూ ఊరుకోరు! నెత్తిన పెట్టుకుని ఊరేగించరు?" అంటూ మెట్లుదిగాడు భీమశంకరం!

'కరణంగారూ! కరణంగారూ!' అంటూ నారాయణరావు వీధి గుమ్మందాకా వచ్చేడు. కాని వెనక్కి తలైనా తిప్పకండా అదేపనిగా జోరుగా వెళ్ళిపోతున్నాడు భీమశంకరం!

అరచి అరచి నారాయణరావు పెదవులు పిడచ కారినయ్. ఆలయందగ్గర తాపీమేస్త్రీలు ఎత్తిన గున పాలు ఎత్తినట్టే ఆగిపోయి తెల్లబోయి చూస్తున్నారు. నారాయణరావు దృష్టి అటు ప్రసరించింది!

'అరే!'

నారాయణరావు గుండె ఆగిపోయింది. గుడి గోపురం పూర్తిగా కూలగొట్టేశారు! నిలబడ్డట్టే నిర్జీవప్రతిమైపోయి నిర్నిమేష నేత్రాలను నిబిడాంధకారమైపోయినట్టున్న నింగిలోకి నిమగ్నం చేశాడు నారాయణరావు!

9

గోడగడియారం నాలుగు గంటలు కొట్టింది. డ్రాయరుమీద తల ఆన్చుకొని కుర్చీలో కునుకుపాట్లు పడుతున్న నారాయణరావు చెవుల్లో ప్రతిధ్వనించాయ్. హృదయాంతరాళంలోనూ అదేపనిగా ప్రతిధ్వనులు శూలాలై మెదులుతూనే వున్నయ్.

మెలకువా నిద్రా మిళితమై కునుకువచ్చి కళ్ళు మూస్తూ, గుండెలో ములుకులా తగిలి కళ్ళు తెరుస్తూవున్న నారాయణరావు ఆ విలయ ప్రతిధ్వానాలకు చలించడంలేదు. కన్ను మూతపడుతున్నప్పుడు సర్వాన్నీ మరిచిపోగలగడం కనురెప్పలు కదులుతున్నప్పుడు డ్రాయరుమీద దృష్టి ప్రసరించ గలగడం మాత్రం జరుగుతోంది.

అతని కనురెప్పల కదలికల్లానే ఆ డ్రాయరు మీది డెయిరీపుటలు మందమందంగా గాలికి ఎగురుతున్నై. తెల్లటి పత్రంమీది నల్లటి అక్షరాలు మిల మిల లాడుతున్నయ్. ఒక పుటలో—

"నా జీవితం రాజకీయరంగంతో ప్రారంభమయింది. పాతికేళ్లవరకూ గాంధీగారి శంఖారవాలకు శ్రుతులు గలుపుతూ..."

రెండుమూడు పుటలు రెపరెపలాడినయ్.

"ఇరవైఆరో ఏట ... పెద్దల బలవంతంమీద వివాహమైంది. అంటే ఈనాటితో కృత్రిమ సమాజంలో నా జీవితయాత్ర ప్రారంభం...సంఘమనే మురికిగుంటలో కళ్యాణమనే కౌగిలం పడవ కట్టుకుని చంటిపిల్లవాడిలా వానాలాట మొదలుపెట్టానన్న మాట!"

మరికొన్ని పుటలు వెనక్కి మడతలుపడ్డాయ్.

"జోడుగుర్రాల బండి ఈ సంసారం. ఒక గుర్రం ముందు నడక. మరొకటి వెనక నడక. దారి అంతకంటె గతుకులబతుకు. సాఫీగా బండి ఎలా సాగుతుంది? అయితే కర్తవ్యం?—మెదడులో ఆలోచన అంకురించింది!"

పది పదిహేను పుట లొక్కసారిగా పరవళ్ళు త్రొక్కాయి.

'పుట్టింటికి వెళ్ళింది మా ఆవిడ. ఆనాడో మర్నాడో వస్తుందని ఎదురుచూస్తున్నా. వచ్చింది: మా ఆవిడ కాదు. విడాకుల పత్రం......ఆడదానికింత బరితెగించినతనమా? ఆవేశానికి ముందు ఆహుతి అయ్యేను. క్రమంగా ఆలోచించాను. ఏమేమి సిద్ధాంతాలు విశ్వసించాను? స్త్రీకి స్వాతంత్ర్యార్హత సిద్ధించకూడదనా ఇప్పటి నా స్వార్థం?

మంచిపనే చేసింది మా ఆవిడ అనిపించింది... అనుకూల్యంలేని దాంపత్యంతో హృదయదౌర్బల్యం ముదిరిన అర్భకులెవరో అణగివుంటారు. ధైర్యవంతులు దైన్యాన్ని తీర్థప్రసాదంగా స్వీకరించరు!...అలా వాటితో నా కౌగిలంపడవ మురికిగుంటలోని కుళ్లు నీటిలో నానిపోవడం మొదలయింది!"

అయిదారు పుటలు అధిగమించాయి—

"డైరీ అనేది సామాన్యవిషయం కాదు. తెలివైనవారు సంవత్సరానికో పుస్తకాన్ని డైరీగా చేయరు. అలా చేస్తే పాతసంవత్సరాల పుస్తకాలు పెంటలమీదికి పోయినా వారికి అభ్యంతరం లేదన్న మాట. కాని నాకు ఒక గ్రంథాన్ని జీవితగ్రంథం చేసుకోవాలని సంకల్పం..."

మరికొన్ని పుటలు గాలికి టపటప కొట్టుకుంటూ ఒక నిమిషానికి ఆగాయి!

"అమ్మాయి విమల అమ్మతో వెళ్లాలనే తీర్పు. నాకెందుకో విమలంటే ఎక్కడలేనీ ప్రేమ. పిల్లని వదిలిపెట్టలేక నాతో వుండమన్నా. ఎనిమిదేళ్ళ కుర్రది ఏమనగలదు? అదృష్టవశాత్తూ తల్లి అభ్యంతర

పెట్టలేదు. అంచేత అమ్మాయి నాదగ్గరేవుంది. ఈవాళటితో అమ్మాయి ఒక నూతన తరగతికి వెళుతూంది పాఠశాలలో!"

గబగబా పాతికముప్ఫై పుటలు గాలికి గిర్రున తిరిగిపోయినయ్.

"అమ్మాయికి పెళ్ళి చేశాను. అభ్యుదయ పథంలోనే అయిందా వివాహం. వరుడు ఆస్తిపరుడు కాదు విద్యావంతుడు! మా అమ్మాయికీ ఆ సంబంధం చక్కగా నచ్చింది. యథాశక్తిగా అందంగా ఆనందంతో జరిపించాను పెళ్ళి. ఆ సందర్భంలో ఎంతచెడ్డా కన్నతల్లి అని కబురంపించా. పిడుగులాంటి వార్త. నా రత్నం పుట్టింటిలోనే వుండిపోయిందట! అప్పటికి వారం క్రితమే కాలం చేసిందని ఆ వార్త! అభాగ్య మాతృమూర్తి! కన్న సంతానంయొక్క కళ్యాణఘడియలికి కాకుండా పోయింది! అనుకున్నా. కంటతడి మిగిలింది."

మళ్ళీ పదిపదిహేను పుటలు తిరిగాయ్!

"ఇంతకంటె దుర్దినం నా కుండదు. పెళ్ళి పందిట్లో పచ్చనితోరణం ఇంకా వాడనేలేదు. మా అమ్మాయి—చనిపోయింది—మురికిగుంటలో నా కౌగితం పడవ పూర్తిగా మునిగిపోయింది—"

తర్వాత పుటంతా తడిసినట్టు ఆనవాలుగా అలుక్కుపోయిన కొన్ని అక్షరాలు! ఆఖర్న స్పష్టాస్పష్టంగా 'ఎందుకు నా శేషజీవితం?' అన్న ప్రశ్న.

అతికష్టంమీద ఒకటి రెండు పుటలు కుర్చీలో కునుకుతున్న నారాయణరావుని చూచి జాలిగా కదిలాయి!

"అమ్మాయి లేని ఆ యింట్లో క్షణం వుండటం దుస్సాధ్యం. లేసులల్లిన గుమ్మం తెరలూ, పువ్వులతో చక్కగా దిద్దితీర్చిన టేబిల్ క్లాతూ, గోడబీరువాలో అమ్మాయి పుస్తకాలూ అద్దాల బీరువాలో అమ్మాయి బట్టలూ ప్రతిక్షణం నన్ను సూదులతో పొడుస్తున్నయ్. ఆఖరికి అమ్మాయి లేని ఇల్లు అంధకారబంధురమైన గుహలా అయి క్షణం ఇంట్లో వుండలేనంతిస్థితికి వచ్చేను. ఎక్కడకు వెళితే మనశ్శాంతి?"

నారాయణరావు కళ్ళు తెరిచాడు. చాలావరకు నిద్రాజడ్డకం వదలినట్టే వుంది. డ్రాయరుమీద ఎదురుగా డెయిరీలో "ఎక్కడికి వెళితే మనశ్శాంతి?" అన్న అక్షరాలు అతని కళ్లల్లో మెదిలాయి. అక్షరాలు మెదుల్తూనే అమాంతం అతని కన్నులు భూతద్దాలు అయినయ్.

నాడూ నేడూ అదే ప్రశ్న, విషదంష్ట్రావిలయ వికటాట్టహాసం! ఆపాదమస్తక కంపనమూ కంపరమూ కలిగింది నారాయణరావుకి. అలానే డైరీబైండు పుట త్రిప్పుదామని చేయి సాచబోయేడు. తిమ్మిరెక్కి కొంకరబోయినట్టు చేయి అస్వాధీనంలో వుండటాన్ని గమనించాడు. ఒక్క కుదుపు కుదుపి అటూ ఇటూ విదిపి చేతిని స్వాధీనం చెసుకోబోయేడు. ఇంతలోకే బయట "నారాయణరావు గారూ!" అని కేక. ఆ ప్రయత్నం మాని నారాయణరావు అడుగు కదిపి తలుపు బారుగా తెరిచాడు. ఒక్కసారి ఉద్ధృతంగా గదిలోకి వచ్చిన గాలికి డ్రాయరుమీద డెయిరీ టపటప కొట్టుకోసాగింది యజమాని గుండెకు సానుభూతిగా.

"ఈ వూరు వచ్చాను. ఇలా అవుతోంది!" అనుకోకండా పైకి అంటూ నారాయణరావు వీధితలుపు తీశాడు.

గుమ్మంలో మున్సబు!

మున్సబుకి నారాయణరావు అన్నది వినబడింది. కాని అర్థంకాలేదు. నారాయణరావుకీ ఆ మాటలు తన పెదాలు ఎందుకు ఉచ్చరించాయో అన్నది అజ్ఞాతమైన అంతశ్చేతనాబలవదావిష్కరణమే!

'రాత్రి మీరుపడిన శ్రమకి ఫలితంగా ఆ మేస్టారికి ప్రాణం లేచి వచ్చిందటండి! హాయిగా వున్నదట. అంతా మాయగావుందే రోగమని ఆశ్చర్యపడుతున్నారు. అదంతా మీచలవ అని వాళ్ళకేం తెలుసు?—' అంటూ మున్సబు ఏమేమో చెప్పుకుపోతూ లోపల ప్రవేశించి కుర్చీమీద ఆసీనుడయేడు.

"ఆ మేష్టారికి ప్రాణం లేచివచ్చిం దటండి!" అన్న మాట నారాయణరావుహృదయంలో గాఢంగా హత్తుకుపోయింది. అన్యవిషయాన్ని గ్రహించే స్థితిలో లేకండా ఆనందం ఒక్కసారి ఉప్పొంగి ఉప్పెన అయి ఉజ్జృంభించింది నారాయణరావుహృదయం. కమిలిపోయిన అతని ముఖంలో కళాకాంతులు మొనలు నిలిపాయి! జీవరేఖలు ననలుతొడిగాయ్!

'మేస్టారికి నయమయిందా వ్యాధి?' ఆనందాన్ని ఆశ్చర్యాన్నీ అచ్చొత్తేలా నారాయణరావు అడిగాడు.

'ఆఁ. వ్యాధే!' అన్నాడు మున్సబు. ఆమాటలోనూ ఆ ఉచ్చారణలోనూ అర్థాంతరం, భిన్నధ్వనీ ఉన్నట్టు కనీసం శంకయినా కలగలేదు నారాయణరావుకి.

'తగ్గిపోయిందా?' అన్నాడు ఉత్సాహాధిక్యంతో తబ్బిబ్బు అవుతూ మళ్ళీ.

అదే వైఖరిలోతల ఆడించాడు మున్నబు.

'ఒక్కసారి వెళ్ళి చూచిరావాలి!'

ఆత్రుతా ఆదుర్దా పెనవేసుకుని అటు ఇటు అడుగులు వేయసాగాడు నారాయణరావు.

'నారాయణరావుగారూ!'

కొత్తగా వినిపించింది మున్నబు పిలుపు. అటూ ఇటూ ఆనందసంచలితుడు అవుతున్న నారాయణరావు యథాతథంగా ఆగి పరిశీలనగా మున్నబు మొహంలోకి చూశేడు. అల్లల్లాడుతున్న మున్నబుకన్నులు చూస్తే రెక్కలాడిస్తున్న గబ్బిలాలు నారాయణరావు దృక్పథంలో కదిలాయి!'

'మున్నబుగారూ!' కృశీభూతమయ్యే కంఠంతో సంబోధించేడు.

'మీగురించి గ్రామంలో కలవరం ఎక్కువగా వుంది.'

'నా గురించా?'

తెల్లబోయి నారాయణరావు తేలకన్నులు వేశాడు.

"అవును. మీగురించే, ఇందాక రెండుగంటలకి కరణంగారూ నేను అలా మేస్టారింటికి వెళ్ళాం ఎలా వుందో పాపం చూదామని..."

నారాయణరావు కళేబరం ఆలకిస్తోంది. మున్నబు రెప్పవాల్చని చూపుతో చెప్పుకుపోతున్నాడు.

"పదిగంటలకే మేస్టారికి తెలివి వచ్చిందట. మేం వెళ్ళేసరికి మామూలుగా వున్నాడు. అంతలో డాక్టరు వచ్చేడు. ఆయన పని ఆయన చూసుకొని "ఆ మహానుభావుడు ఆదుకోబట్టి పెద్ద ఖరీదయిన ఇంజక్షన్లు ఇచ్చిపాశేశా. ఇక నీకేం భయమక్కర్లేదు. రెండురోజుల్లో లేచితిరుగుతావ్.' అన్నాడు. 'ఏ మహానుభావుడని?" వింతగా చూశాడు మేస్టారు.

నారాయణరావుగారూ! మీకా మేస్టర్లు ఏమయితే ఏంకావాలి? మంచికి పోయి తలదూర్చేరు. కరణంగారు కాస్తా కలహాగ్ని రాజేసేడు. "ఇంకే మహానుభావుడు. మీ ఆవిడని ప్రతిరోజూ పనిగట్టుకు చూస్తూ మురిసిపోయే ఆ ముసలి పీనుగే! నారాయణరావట నారాయణరావు!" అన్నాడు కరణం. ఆ పుల్ల విరుగుడిమాటలకి మిడిగుడ్లు తేలవేశాడు మేస్టారు. డాక్టరు తలవంచుకుని దారితీశాడు. మధ్య నేను మంటలో పడ్డ మిడతలా మాడిపోయేను. ఇంకేవుంది. తడిసిన పుల్లలయినా అగ్గి రాజిందంటే ఆగుతుందా మహాశయా!" అన్నాడు మున్నబు.

నారాయణరావులో సగం చైతన్యం తప్పింది. 'ఇకనుంచయినా మీ రటు వెళ్ళకండి. ఆ కంఠానికేం? నియోగిపిండం నియోగిపిండమే!" అంటూ మున్నబు లేచాడు. రాతిబొమ్మలా కనిపించాడు నారాయణరావు.

'వస్తాను సెలవండి.' మున్నబు మెల్లగా కదిలాడు.

నారాయణరావు గాజుకళ్లు చూస్తున్నాయి.

మున్నబు మెట్లు దిగుతున్నాడు. పిలుద్దామనిపించింది నారాయణరావుకి పొడిగొంతుక విడివడలేదు. కదలిక కలిగిన కొయ్యలా అరుగుమీదికి వచ్చేడు నారాయణరావు. మున్నబు నడక గుడివయిపు సాగుతుండటం మసకగా కనబడుతోంది. అటే నారాయణరావు నిస్తేజమైన నేత్రాలు నిర్జీవంగా చూడసాగాయి!

నేలమీద కూలిపడిన గుడిగోపురం ఇటికల దొంతరమీద మున్నబు కాలు కదం తొక్కడం కనిపించింది. ఆపక్కనే—

నారాయణరావు కళ్లు విప్పారినాయి. గుండెల్లో ముళ్ళు గుచ్చుకున్నయ్.

ఆ పక్కనే—ఇటికదిమ్మల ఇరుకున టపటప రెక్కలు కొట్టుకుంటున్నది—మగ పావురమే!

నారాయణరావు నరనరాల విద్యుద్ఘాతం కలిగింది! మరీ స్థాణువైపోతూ శూన్య దృక్కులతో చూస్తున్నాడు.

మున్నబు పావురాన్ని బైటికి లాగేడు. గాలిలోకి వదిలేడు.

నారాయణరావు చూశేడు.

'అరే! ఎగరలేక కింద పడిపోయిందే!'—

ముందుకు వంగబోయిన నారాయణరావు తూలి నిలదొక్కుకొంటూ చూశాడు.

"పాపం! రెక్కలికి దెబ్బ తగిలింది. అదిగో స్పష్టంగా గాయం నెత్తురు ముద్దకట్టి కనిపిస్తోంది.

'మున్నబుగారూ!' ఎల్లాగో నారాయణరావు గొంతుకముడి విడివడింది. మున్నబు తలదిప్పి చూశాడు.

అడుగు వేయబోయి నారాయణరావు ముందుకి మోకరిల్లాడు!

మొదట నవ్వూ తర్వాత ఒక వికారకవళిక మున్నబు కళ్ళల్లో ప్రతిఫలించినయ్.

కాళ్ళకు అడ్డుపడిన సుడిగాలిని తప్పించుకొంటూ నారాయణరావు అడుగులు ఎల్లాగెల్లాగో ముందుకు పడుతున్నయ్. కళ్లు బయర్లు గ్రమ్ముతున్నయ్. చీకటి భావురుమంది.

10

కొన్ని రోజులు గడిచినయ్.

పునర్నిర్మాణ దశలో ఆలయం పులకరించింది. కొత్త సున్నం కమ్మదనంతో కూడిన ఘాటును వెలిగ్రక్కుతోంది. చతురస్రాకృతిపర్యంతం నల్ల సిమెంట్ పూత పెట్టబడింది. కొత్త గోపురం రేఖామాత్రమైన ఆకృతి దాల్చింది.

నడంచావిడిలో గుమ్మానికిఎదురుగా నారాయణరావు కూర్చున్నాడు. నూతన శోభలు చిందుతున్న గుడి కన్నులను మిరుమిట్లు గొల్పుతోంది. కాని ఆ కన్నుల అంతఃకోణాలలో మసకదనమే! అది కుర్చీ చేతిమీదున్న పావురంమీద దృష్టి పడినప్పుడల్లా బాగా బహిర్గత మవుతోంది. బాధతోనే నారాయణరావు మనస్సు పక్కనున్న పావురాయిని ఓదారుస్తోంది.

అనునయంగా నారాయణరావు పట్టుకుచ్చుల వంటి రెక్కలని దువ్వుతూ పావురం కళ్ళల్లోకి చూశాడు. మెడకింద గాయం కనపడింది. నారాయణరావు బాధ భావనగా మారసాగింది.

'పాడులోకం!'

గుహాంతరంలోని కారుచీకటిలా నారాయణరావు గుండెలో మూలుగు నలుమూలలా ఎగ్రబాకింది. కాస్సేపటికి 'కాదు. లోకాన్నెందుకనాలి?' అన్న అభిప్రాయం కలిగింది. గుహాభ్యంతర తిమిరాంధకారంలోకి ఉషఃకాంతులు ప్రసరించినట్టే మెదడు మెరిసి నారాయణరావు తెలివి విరిసింది. 'కావలసి లోకం అపార్థం చేసుకోదు. ఒకళ్ళకి అకారణంగా అన్యాయమూ తలపెట్టదు. విషయాన్ని అర్థం చేసికోనేంత విపులజ్ఞానం వ్యక్తిగతంగా లేక ఈ దురవస్థ. మానవుడికి విజ్ఞాన వికాసం లేకపోవడం ఆ మానవుని స్వయంకృతాపరాధమూ కాదు. పూర్వజన్మ దుష్కృతిమూ కాదు. కాలవైపరీత్యమో! కాల నియంతృత్వమో! అనుకోవాలి. ఏమయితేనేం?- అనుకుంటూ నారాయణరావు తలదిప్పడంలో బల్లమీద డైరీ కనిపించింది. ఒక్కసారి గుండె గతుక్కుమని కూడా నిబ్బరం వహించి నారాయణరావు చేతిలో జాలిగా దీనంగావున్న పావురాన్ని చూశాడు.

'తోటి పావురం లేదని ఎంతగా విలపిస్తున్నదో! ఈ మూగజీవాల వేదన బాధా ఎవరికి పడతాయి. ఒకవేళ సానుభూతిగలవారుంటే మాత్రం ఏం చేయగలరు? దీని బాధ నాకు తెలుసు. అందరికీ తెలుసు. తోటిపావురం లేదనే ఇంత దీనతా విచారాధీనతాను. అయితేనేం ఎలా ఆడపావురం దొరుకుతుంది? ఎక్కడికి పోయిందో! ఏ చెట్లో పుట్లో శరణ్యంగా అదెంత ఆవేదన పడుతుందో! దానికిమాత్రం ఈ మగపావురాని కున్నంత వియోగదుఃఖం వుండదూ? విడాకులిచ్చింది గనుకనా వినిర్భయంగా స్వేచ్ఛా సంచారం చేయడానికి! నిజమే, రెంటికీ అన్యోన్యత వుంది. పరస్పరం సమాగమన ప్రయత్నంతో క్లేశాన్నే అనుభవిస్తున్నాయ్. ఎలా వాటికి సంధానం? ఏవిధంగా మధ్యవర్తి వాటిని ఒచోటికి చేర్చగలడు? అయితే అవి అలా వియుక్తజీవులు కావలసిందేనా?

ప్రేమజీవులల్లా—పాపం, అడివిలో మహాకీకారణ్యంలో ఎక్కడో ఆడపావురాయి మల్లేనే, ఈ కుగ్రామంలో ఊరిచివర పూరిగుడిశలో హరిజనవాడలో ఇరవైయేళ్ల పంతులమ్మకూడా ఎంతగా అవస్థపడుతుందో? ఎంతగా భర్తృతిరస్కారాన్ని భరించలేక బాధపడుతోందో? ఏవిధంగా ఆ అమ్మాయికి ఓదార్పు? మనశ్శాంతి?

అసలంత ఇబ్బంది కలిగిందో లేదో! ఆ మేష్టారు అంతలోనే అపార్థం చేసుకొంటాడా? చేసుకోకపోతే అంతా ధన్యులే. చేసుకుంటే ఏవిటి గతి? మొన్నా అటుమొన్నా స్వస్థత చేకూరక ఊరుకోవచ్చు. ఇవాళో రేపో పూర్తిస్వాస్థ్యం చేకూరుతుంది. శంకితహృదయుడు! ఏమి అఘాయిత్యానికి ఒడగట్టుతాడో! కొంపదీసి ఆ పిల్లని అన్యాయంగా పొమ్మనడు గదా?—కొంతవరకూ భయమో భక్తో వుంటానికైనా అనూచానంగా వచ్చే ఆచారాల అడుగుజాడల్లో మంత్రోక్తంగా వివాహమైనా కాలేదు—! అయి

నంతలో అదొక స్థిరత్వసాధనం అని కాదు! ఏమిటో—

గాలిలోని జ్వాలికలవి! స్వేచ్ఛావిహాయసంలోని ప్రేమపక్షులు వారు!—

ఊహ సాగే కొలదీ నారాయణరావుకి భయాందోళనలు ద్విగుణీకృతాలయి బాధావిలమైన మనస్సుతో మథనపడిపోతున్నాడు.

ఉన్నట్టుండి చేతిలోని మగపావురం కీఁ కీఁ మంది. ఏమిటా అని నారాయణరావు పావురంవంక చూశాడు. పావురం ముక్కు పైకీ కిందికీ ఆడిస్తూ ఏదో చెబుతూన్నట్టు కనిపించింది?

ఏమిఁటా మూగభాషకి భాష్యం?

"ఓహో!—" జ్ఞాపకం వచ్చింది నారాయణరావుకి!

"హరి!"' విస్మయ ప్రకటన తెలీకండానే జరిగిపోయింది.

"పక్షి అయితేమటుకు ఎంత వివేకం! మానవునిలోకంటె గొప్పగా జ్ఞానం వుంది. చ్! నిజంగా సృష్టిలో ప్రాణులన్నీ స్వతస్సిద్ధంగా స్వకీయమైన వివేక విజ్ఞానాలు కలవే కాబోలు!—

నాలుగు రోజుల్నుంచి సరిగ్గా ఇదేసమయానికి గాయానికి కట్టు మార్చి కొత్తగా మందు వేస్తున్నాను. పరధ్యానంలో పడి ఈ పూట మరిచిపోతే ఇదే ముక్కుతో మూగభాషతో జ్ఞాపకంచేసింది. మాఁవు డైన రోగికి కూడా తన ఆరోగ్యంమీద ఇంతగా ఆసక్తి వుండదేమో! ఎంత తెలివిగా నా మందమరుపుకి మందు వేసింది! బలే!—"

ఎక్కడలేని సంతోషమూ కలిగింది నారాయణరావుకి. అంతవరకూ తలపోసిన ఆలోచనలు ఏ గాలిలో కలిసిపోయాయో! అనుకొన్న విషాద విచిత్రఘట్టాలు ఏ తెరచాటునకు పోయి కోటాలు కడుక్కున్నాయో!—ఉత్సాహంగా ఉప్పొంగిపోతూ పావురాన్ని అరచేతుల్లో వుంచుకొని ఆప్యాయంగా లేచేడు.

పసిబిడ్డను బాలింతరాలు నీళ్లు పోయడానికి తీసుకు వెళ్ళినట్టుగా అరచేతుల్తో స్పర్శాసహంగా పట్టుకొని నారాయణరావు వాకిట్లోని బావిదగ్గరకు వెళ్లేడు.

ఎక్కడ కొనగోరు పచ్చిగాయానికి సుచ్చుకుంటుందో! పావురం లేతహృదయం ఎక్కడ నొచ్చుకుంటుందో అని నారాయణరావు బాధ. నిజానికి పావురం గాయం చాలావరకు మానింది. కాని నారాయణరావుకి అంత ఆప్యాయత!

బహు భద్రంగా కట్టు విప్పేడు. మెలమెల్లగా ఒకే చుక్క చొప్పున నీటిబిందువులు జారవిడుస్తూ గాయాన్ని క్షాళన చేశాడు. తన చేయి ఆ గాయాన్ని తాకితే చాలు పావురం ఎంత విలవిలలాడిపోతుందో అనే భయం. తీరా పొరబాటున తగిల్తే తన ప్రాణాన్ని ఎవరో లాగుతున్నట్టూ హృదయాన్ని రంపంతో కోస్తున్నట్టూ బాధపడుతూ నారాయణరావు అతిజాగ్రత్తగా రెక్కల గూడుకూ మెడకూ నడిమి భాగానవున్న గాయాన్ని కడిగాడు.

పురిటి పాపను స్నానంచేయించి తల్లి ఏవిధంగా పట్టుపాత్తిళ్ళల్లో వేసికొని లోపలికి తీసుకువెళుతుందో అంత సుకుమారంగానూ ఆప్యాయంగానూ పావురాన్ని అరచేతుల్లో వేసికొని మెల్లగానడుస్తూ ఎట్లాగో వసారా గదిలోకి వచ్చేడు. అతికోమలంగా పావురాన్ని పీటమీద ఉంచేడు. అలమారలోంచి మందుసీసా డాక్టరిచ్చిన మెత్తని దూదీ తీశాడు. వేయికళ్లతో చూస్తూ కట్టుకట్టడానికి ఉపక్రమించాడు నారాయణరావు.

అంతలో నడం చావిడిలోకి ఎవరో వచ్చిన అలికిడి విస్పష్టంగా వినిపించింది 'ఎవరు?' అందామని తల యెత్తాడు. కాని అనలేదు. తీరా పలకరించిందాకా వుంటే ఫలానా అంటారు. కరణమో మున్నబో అయితే గమ్మున వెళ్ళాలి. లేకపోతే ఆలస్యాన్ని అనేక విధాలుగా ఊహించి ఏమైనా అపనిందలు వేయగలరు. వేసినంతలో తనకేం పోదుగాని ఎవరైనా నష్టపడవలసివస్తే తనకి కాదా ఆ కష్టం. ఇప్పుడా అమ్మాయి ఎలాంటి అవస్థలో వుందో! అదిగాక వచ్చినవారికోసం తొందరపడి వెళితే ఇక్కడ చికిత్స అసంపూర్తిగా ఆగిపోతుంది. ఈ పావురం ఎంత బాధపడుతుందో!—అనుకొని నారాయణరావు లేచి వెళ్లడానికి అంటే పావురానికి చికిత్సమాని వెళ్లడానికి మనసొప్పక పావురాన్ని చూస్తూ 'సరే వచ్చినవాళ్ళు ఎలాగూ వుంటారు. ఏ బల్లమీదో కుర్చీమీదో కూర్చోగలరు. లేదా ఈలోగా పిలువనే పిలుస్తారు. అప్పుడా కంఠాన్నిబట్టి ఆలోచించవచ్చు." అని కూడా స్వగతించుకొని నారాయణరావు పావురానికి కట్టుకట్టడంలో నిమగ్నుడయేడు!

ఆ చిన్ని గాయానికి—ఇంతాజేసి ఒక పక్షి గాయానికి—కట్టుకట్టడానికి నారాయణరావుకి అరగంట సుమారు పట్టింది. మందుసీసాలు అలమారలో

పదిలపరిచి మరీ ఆప్యాయంగా పావురాన్ని అరచేతుల్లో వుంచుకొని నడుం చావిడిలోకి వచ్చేడు నారాయణరావు.

ఎవ్వరూ లేరక్కడ. వళ్లు పెకలించుకు మరీ చూశాడు నారాయణరావు. ఎవరూ లేన్ది ఎంతగా జూస్తే మాత్రం ఎలా కనిపించగలరు?

“ఎవరో వచ్చేవుండాలి. స్పష్టంగా అడుగుల జాడా అలికిడీ వినిపించింది.' వస్తే మరా వ్యక్తి ఎందుకు వెళ్ళిపోయినట్టు? అసలెందుకు వచ్చినట్టు? వచ్చిన పనేమిటో పరిష్కారం కానిదే కనీసం వ్యక్తినైనా కలిసికోనిదే ఎందుకు వెళ్లిపోతాడు? వెళ్లడు. అంటే ఎవరూ రాలేదన్నమాట. రాకపోతే ఆ ధ్వని ఏమిటి? పోనీ వచ్చి వెళ్ళేడే అనుకుందాం. వచ్చినప్పుడు అయిన అలికిడి వెళ్ళినప్పుడు మాత్రం అవ్వదూ? అలాంటి అలికిడి తిరిగి వినబడలేదే! అంచేత రాలేదనుకోవచ్చా? ఒకవేళ ఆ రెండోసారి అలికిడి తన కార్యనిమగ్నతలో వినిపించలేదేమో! అలాగనుకున్నా వచ్చిన ఆ వ్యక్తి అప్పుడే ఎందుకు వెళ్ళిపోవాలి? అసలు ఇంతకీ ఆ వచ్చిందెవరో? కరణమా? మున్సబా? కాక మరెవరైనానా? మరెవరైనా అయితే ఎవరైవుంటారు? తరచు వచ్చేవారిలో ఒకరే అయివుండాలి. అంటే తరచురాని వ్యక్తిగాని అసలు రాని వ్యక్తిగాని రాకూడదని వుందా? ఎప్పుడూ రాని వారు ఎందుకు వస్తారు? వస్తేమాత్రం ఏం ఉద్ధరణ జరిగిందని వెళ్ళిపోవాలి? ఏం? ఎందుకు వెళ్లకూడదు? ఆయన లేరుకాబోలు మళ్ళీ రావచ్చు అని వెళ్ళినా వెళ్ళిపోడానికి సావకాశం వుంది. ఏమిటో ఇదంతా. ఎవరో ఇంతకీ వచ్చింది. ఇదంతా అనవసరమైన తర్కవితర్కమా?”

పరిపరివిధాలుగా ఊహలు సాగిన నారాయణరావు దృష్టి మగపావురంమీదుగా బల్లమీదికి ప్రసరించింది!

'అరే!' ఆశ్చర్యం ప్రకటితమయింది. అడుగు ముందుకు పడింది.

“బల్లమీది డైరీ అలావుందేం! ఎవరో పుటలు అటూ ఇటూ తిప్పినట్టు వుందే!—”

విస్మయపడుతూ నారాయణరావు బల్లదగ్గరకు వెళ్ళి తెరువబడిన పుటలోకి తొంగిచూశేడు.

“నిజంగా నాకు మనశ్శాంతి లభించింది. అచ్చంగా ఆమె నా కూతురే! అప్పుడప్పుడు మా అమ్మాయి చనిపోలేదనీ, నన్ను మోసంచేసి నా కంటి ముందో వెనుకో చాటుగా ఈ వూరు వచ్చేసిందేమో అనీ అనిపిస్తుంటుంది నాకు. అలా అమ్మాయి తటస్థపడగానే అనేక పర్యాయాలు తబ్బిబ్బుపడ్డాను. సరిగా ప్రతి సాయంకాలం నాలుగు గంటలయాక బడినుంచి వస్తున్న ఆమెను చూస్తుంటే నా కళ్లకి మా అమ్మాయి సాక్షాత్కారమే! మనస్సుకు ఆనందమవుతుంది నాకు. ఆమె బడిలో మేస్టారో! హరిజనవాడలో కాపురముంటున్న గృహిణియో! ఎవరయితేనేం నాకుమాత్రం అది అనవసరం. ఆమె నా దృష్టికి మా అమ్మాయే!

అదే వయస్సు. అలాంటి రూపురేఖలే! సరిగ్గా అలాంటి సరిగంచు చీరో వాయిలుచీరో గాని, వెడల్పటి పువ్వుల అద్దకాలతో, ఇప్పటికీ మా అమ్మాయి పెళ్ళినాటి ఫోటో కాలికో బైండులో వుంది. నలుపైనా అలాగే నవ్వుమొహం పక్కను మేస్టారుతో ఆమె కలకల కంఠంతో కిలకిల నవ్వుతో గలగల గాజులతో నడిచి వెళుతుంటే మా అమ్మాయి భర్తతో హాయిగా ఆనందంగా షికారు వెళుతున్నట్టే నా అనుభూతి! అందుకు సాయం గుడికోటరంలోని పావురాల జంట నా ఊహలకీ భావాలకీ ప్రాతిపదిక! ఇవాళ ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే ఒక ఆరేళ్ళబ్బాయిమీద నా మనసు లగ్నమవ్వడమే!

అంతి అబ్బాయి ఆ దంపతులకి—పంతులమ్మకీ మేస్టారికీ కాదు—మా అమ్మాయికీ అల్లుడికీ ఎప్పుడు కలుగుతాడో అని నాకు ఆవేదన! ఆరాటం! అంతర్మథనం!

అర్థరహితమే కావచ్చు అనుభవపూర్వకం! ఇది ఎవరైనా చదవడం సంభవమయితే వారు నన్ను పిచ్చివాడే అనుకుంటారో! ఏమైనా నిజానిజాలూ మానసిక మథనం అందులోని అంతరాలూ గ్రహిస్తారో మరి!—

ఆఖరివాక్యం చదువుతుండగా ఆనందబాష్పమో దుఃఖబాష్పమో, ఉభయసమ్మిశ్రితమో — నారాయణరావు అక్షిద్వయంలోంచి వెలువడి కతినకపోలం మీదనుంచి జారి చుబుకాగ్రమందు ఒకటై ఆ పుట మీద 'టప' ధ్వని చేసింది. బరువుగా ఒక సుదీర్ఘమైన వేడి నిశ్వాసం నాసాగ్రాల్లోంచి వెలువడి, తేలికయిన తలను తిప్పి ఎందుకో అక్కణ్ణుంచే నారాయణరావు ఆలయంవంక చూశాడు.

మబ్బుల్లోంచి బయల్పడుతూన్న చంద్రబింబంలా మరామత్తులోంచి కొత్తగుడి ఆకృతిదాల్చింది!

చంద్రబింబం చుట్టూ పరివేష మండలముల్లే కాంతివలయాన్ని ధగధగచ్ఛటలతో కడుతున్న సరికొత్తలోహ శిఖరం!

ఆ శిఖరంమీద రెండు పావురాలు వాలి పరస్పరం కిలకిల ధ్వనులు చేస్తున్నయ్!

నారాయణరావుకి ఓ నూతన దృశ్యం దృగ్గోచరమయి కుతూహలంగా చూశాడు. "నిజంగా అది పావురాల జంటే! ఏ పావురాలో కావు. రోజూ కోటరంలో కనిపించేవే!—ఏమిటిది? ఎలా వచ్చేయి? మగపావురం నా చేతిలోనే వుండాలే!"

అంతా వింతగా విచిత్రంగా అనిపించి కళ్లు నులుముకుంటూ చేతుల్లోకి చూచుకున్నాడు నారాయణరావు. "అరచేతిలో మామూలుగానే వుంది మగపావురం! అయితే ఆ దృశ్యం నా ఊహేనా? ఎందుకిప్పుడిలాంటి మంచి ఊహ కలిగింది! వెనకోసారి దురూహ కలిగింది! ఇప్పుడీ ఉత్సాహకరమైన ఆనందప్రదమైన ఊహ! అబ్బా! ఊహలు ఎందుకు ఉత్పన్నమవుతుంటాయో! ఎలా ఉత్పన్నమవుతుంటాయో?"

అనుకొంటూ నారాయణరావు ఒక స్వచ్ఛ స్వచ్ఛందప్రవృత్తితో ఆలయంవంక మళ్ళీ చూశాడు. అటు చూస్తునే మగపావురంవంక దృష్టి మళ్లించాడు.

కిలకిలమంటూ రెక్కలాడించి మగపావురం కాస్తా ఎగిరింది!

నిర్ఘాంతపోయి చూస్తున్నాడు నారాయణరావు. ఎగురుతూ ఎగురుతూ ఆ పావురం కొత్తగా ఎగురు పట్టిన గోరింకలా సరాసరి కిటికీవయపు వెళ్ళి చటుక్కున చువ్వల్లోంచి బైటికి ఎగిరిపోయింది.

నారాయణరావు దిగ్భ్రాంతుడై జరుగుతున్నదంతా ఇంద్రజాలమనిపించి అలా పావురం నిర్గమించగానే కిటికీదగ్గరకు తనకు తెలీకండానే నడిచివచ్చేశు. కిటికీలోంచి బైటికి తొంగిమాశేశు. బైటికి ఎగిరిన పావురం తిన్నగా గుడిమీద వాలి అంతలోకి రెక్కలాడించి అంతరిక్షంలోకి పశ్చిమాభిముఖంగా పయనమయింది. అటే దృష్టి పోనిచ్చాడు నారాయణరావు. అప్రయత్నంగా బడినుంచి వచ్చే బాటవయిపు అధోవలోకనం చేశాడు అంతసేపూ ఆకాశంలోకి చూస్తున్నవాడల్లా.

సన్నమవుతూ చెట్లలో ఇరుక్కుపోయినట్టు వున్న బాటవెంబడి ఎవరో వెళ్లడం చూసి ఎవరా అని దృష్టిని తీక్ష్ణప్రసారం చేశాడు నారాయణరావు.

"బడికి అభిముఖంగా ఆ వెళుతున్నది ఆ మగమేష్టారే! అదిగో! బడినుంచి ఎదురుగా వస్తున్నది పంతులమ్మే!"

నారాయణరావు కళ్ళల్లో ఒక్కసారిగా చిమ్మచీకట్లు చిందులాడి అంతలోనే వెలుగు వెల్లువ పెల్లుబికింది!